తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

మెదక్ - మహబూబ్‌నగర్

సంగారెడ్డి | సిద్దిపేట

జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్

బుధవారం

09 సెప్టెంబర్ 2026



## వినాయక చవితికి విగ్రహాలు సిద్ధం





- **అడ్వాన్స్ చెల్లించి విగ్రహాలను బుక్ చేసుకుంటున్న యువకులు**

**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):**
వినాయక చవితి ఈనెల 14 న ఉండడంతో నారాయణపేటలోని గణేష్ తయారీ కేంద్రాల్లో విగ్రహాలకు పెయిటింగ్ తో రూపురేఖలు వేసి అమ్మకానికి సిద్ధం చేశారు. కొందరు వ్యాపారులు హైదరాబాద్, షోలాపూర్, నుంచి విగ్రహాల కొనుగోలుతో పాటు పర్యావరణానికి మేలు చేసే మట్టి వినాయక విగ్రహాలను అమ్మకానికి పెట్టారు. గతేడాది కంటే ఈ సంవత్సరం విగ్రహల కలర్స్, అలంకరణ సామాగ్రి, ట్రాన్స్ పోర్ట్ కారణంగా రేట్లు కాస్త పెరిగాయని వ్యాపారి జాజాపూర్ విజయ కుమార్ తెలిపారు. యువకులు గణేష్ కేంద్రాలకు వెళ్లి వివిధ వినాయక విగ్రహాలను చూసి తమకు నచ్చిన విగ్రహానికి వ్యాపారులతో బేరసారాలు జరిపి వారికి కొంత నగదును ఇచ్చి బుక్ చేసుకుంటున్నారు. ఇదివరకే ధన్వాడ, దామరగిద్ద,, మక్తల్, నేరడగం, తదితర గ్రామాల యువకులతో పాటు సరిహద్దు కర్నాటకలోని సైదాపూర్, యాద్గీర్, గురుమిట్కాల్ నుంచి వచ్చిన యువకులు విభిన్న రూపాల్లో ఉన్న వినాయకుల విగ్రహాలకు అడ్వాన్స్ చెల్లించి బుక్ చేసుకుని వెళ్లారు. దీంతో అయా గణేష్ తయారీ కేంద్రాల వద్ద సందడి నెలకొంది.

## మరికల్ తహసిల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 8(జనంసాక్షి):** మరికల్ తహసిల్దార్ కార్యాలయాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ పరిధిలో కొనసాగుతున్న కార్యకలాపాలపై తహసిల్దార్ రామ్‌కోటిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూ భారతి కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించిన ఇతర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. పెండింగ్ దరఖాస్తులను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరి ష్కరించాలని అధికారుల ను ఆదేశించారు. భూముల రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కొత్తగా నిర్మించిన సమీకృత మండల కార్యాలయ భవనం పరిసరాల్లో, ముఖ్యంగా ప్రహరీ చుట్టూ అపరిశుభ్రత నెలకొని ఉండ టంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యాలయ పరిసరాలను ఎప్పటికప్పు డు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. మండలంలో చేపడుతున్న వీ.ఓ. భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయించాలని ఎంపీడీఓ పృథ్వీరాజ్‌కు కలెక్టర్ సూచించారు. నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, నిర్దేశిత సమయంలో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## అర్హత ఉన్న ఏ ఒక్క ఓటు జాబితాలో మిస్ కావొద్దు

### నోటీసులు, ధృవీకరణ, డాక్యుమెంట్ల అప్‌లోడ్‌ను వేగవంతం చేయాలి: కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** ఓటరు జాబితా పరిశీలన ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించి అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా జాబితాలో మిస్ కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. మంగళవారం ధన్వాడ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన ఆమె, ఎన్నికల అధికారులు, ఏఈఆర్‌ఓలు, బీఎల్‌ఓలతో క్షేత్రస్థాయి ప్రక్రియపై సమీక్షించారు.
రోజువారీగా ఎన్ని నోటీసులు జారీ చేస్తున్నారు, ఎంతమంది నుంచి అవసరమైన డాక్యుమెంట్లు స్వీకరించారు, ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయనే వివరాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నోటీసు జారీ చేసిన వెంటనే సంబంధిత ప్రక్రియను పూర్తి చేసి వివరాలను యాప్‌లో ఎలాంటి జాప్యం లేకుండా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఓటరు కార్యాలయానికి రావాల్సిన అవసరం లేని సందర్భాల్లో నిబంధనల మేరకు క్షేత్రస్థాయిలోనే ధృవీకరణ చేపట్టాలని తెలిపారు. అవసరమైన ఫొటోలు, ధృవీకరణ వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. ఏఈఆర్‌ఓల పరిధిలోని పోలింగ్ స్టేషన్లు, పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకుని, పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.
బీఎల్‌ఓ డిక్లరేషన్, ధృవీకరణ ప్రక్రియ సక్రమంగా జరుగుతున్నదీ లేనిదీ పరిశీలించాలని, నిబంధనల ప్రకారం అవసరమైన చోట ఓటరుతో పాటు సంబంధిత ఇన్‌చార్జి, బీఎల్‌ఓ కలిసి గ్రూప్ ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారా అని తనిఖీ చేయాలని సూచించారు.
11 రకాల డాక్యుమెంట్లలో నిబంధనలకు అనుగుణంగా ఏదైనా ఒక చెల్లుబాటు అయ్యే పత్రం సమర్పించినా పరిశీలించి తదుపరి ప్రక్రియ చేపట్టాలని తెలిపారు.
అన్‌మ్యాప్డ్ ఓటర్ల వివరాలను ప్రత్యేకంగా పరిశీలించి, మ్యాపింగ్ పూర్తికాని కారణాలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో కొందరు ఓటర్లను నేరుగా అడిగి వారి వివరాలు సంబంధిత పోలింగ్ స్టేషన్‌కు సక్రమంగా మ్యాపింగ్ అయ్యాయా అని కలెక్టర్ పరిశీలించారు. వేగం, ఖచ్చితత్వం, పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## పరిశుభ్రత మున్సిపల్ బాధ్యత...

- **కొత్త ఆటోలను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్**



**పెబ్బేరు, సెప్టెంబర్ 8 (జనం సాక్షి):**
పెబ్బేరు పురపాలక సంఘంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.25.2 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన రెండు చెత్త సేకరణ ఆటోలను మంగళవారం మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు.
మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, కమిషనర్ ఏ, సైదయ్య, కౌన్సిలర్లతో కలిసి వాహనాలకు పూజలు నిర్వహించి, జెండా ఊపి ప్రారంభించారు.
ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, పట్టణ పరిధిలో నిత్యం చెత్త సేకరణ వేగవంతంగా జరిగేందుకే ఈ కొత్త వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రతి వార్డులోనూ ఇళ్ల వద్దకే ఆటోలు వచ్చి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తాయని పేర్కొన్నారు.
పట్టణవాసులు చెత్తను వీధుల్లో లేదా కాలువల్లో వేయకుండా ఆటో డ్రైవర్లకు మాత్రమే అందించాలని, పురపాలక సంఘాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జములమ్మ, పర్వీన్ షకీల్, శివ సాయి, తాటికొండ కృష్ణ, భాగ్యలక్ష్మిశివ, సౌభాగ్య దిలీప్ రెడ్డి, హరి శంకర్ నాయుడు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తీవ్రమైన కరెంటు కోతలు.. ఎండిపోతున్న పంటలు

- **24 గంటలను కరెంటు ఇస్తున్నామని గొప్పలు చెబుతున్న ప్రభుత్వం**
- **క్షేత్రస్థాయిలో 8 నుంచి 10 గంటల నాణ్యమైన కరెంట్ కూడ ఇవ్వలేక పోతుంది**
- **అడుగంటిపోయిన భూగర్భ జలాలు, తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు**
- **తక్షణమే రంగనాయక సాగర్ నింపి సాగునీరు విడుదల చేయాలని రైతుల డిమాండ్**
- **తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని కన్నీరుమున్నీరవుతున్న రైతన్న!**







**నంగనూరు సెప్టెంబర్ 8 (జనంసాక్షి):**
నంగనూరు మండల వ్యాప్తంగా కరువు రాక్షసి పడగ విప్పింది. ఒకప్పుడు పచ్చని పంటలతో కళకళలాడిన చేన్లు నేడు నెర్రలు బారిన నేలలుగా మారాయి. తీవ్రమైన విద్యుత్ కోతలు, అడుగంటిన భూగర్భ జలాలు రైతాంగాన్ని కోలుకోలేని దెబ్బ తీశాయి. కంటికి రెప్పలా కాపాడుకున్న పంటలు కళ్ల ముందే ఎండిపోతుంటే, చేతికొచ్చే దిగుబడి తుడిచిపెట్టుకు పోతుంటే రైతన్నలు కన్నీటి పర్యంతమవుతున్నారు.
మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లోనూ పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. వేలాది రూపాయల అప్పులు చేసి, విత్తనాలు, ఎరువులు వేసి సాగు చేసిన పంటలు చివరిదశలో నీరు అందక మాడిపోతున్నాయి. రోజుకు కొన్ని గంటలు కూడా సరిగా కరెంట్ ఉండకపోవడం, వచ్చిన కొద్దిసేపు కూడా లో-వోల్టేజ్ సమస్యలతో మోటర్లు కాలిపోవడం రైతులకు శాపంగా మారింది. వేల అడుగుల లోతుకు బోర్లు వేసినా చుక్క నీరు బయటకు రావడం లేదు. భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోవడంతో ఏ బోరు చూసినా గాలి మాత్రమే వస్తోంది.
పంట పండితే అప్పులు తీరుద్దామనుకున్నాం.. కానీ ఇప్పుడు పంటను బ్రతికించుకోవడమే గగనమైపోయింది. 24 గంటల కరెంటు ఇస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం ప్రస్తుతం తీవ్రమైన కరెంటు కోతలతో రోజుకూ 8నుండి 10 గంటల కూడా సరిగా కరెంట్ ఉండటం లేదు. కళ్లముందే ఎండిపోతున్న చేనును చూసి గుండె తరుక్కుపోతోంది" అని పలువురు రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.
ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి అప్రకటిత విద్యుత్ కోతలను నివారించాలని, తగినంత కరెంట్ సరఫరా చేసి పంటలను కాపాడాలని రైతాంగం డిమాండ్ చేస్తోంది. ఎండిపోయిన పంటలకు ఎకరాకు తగిన పరిహారం అందించి, నంగనూరు మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి తమను ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

**కాళేశ్వరం జలాలతో రంగనాయక సాగర్ నింపాలి...**
గోదావరి నదిలో వృధాగా పోతున్న నీటిని ఒడిసిపట్టి కాళేశ్వరం ద్వారా రంగనాయక సాగర్ నింపి కాలువల ద్వారా రైతులకు సాగునీరు అందించి పంటలను రక్షించాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తా ఉన్నారు. ప్రభుత్వం రాజకీయాలు చేయడం మని వ్యక్తిగత పట్టింపులు పక్కన పెట్టి రైతుల పక్షాన నిలబడాలని తక్షణమే రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

# పసిప్రాణాలతో చెలగాటం.. ప్రైవేటు స్కూల్ బస్సు ప్రమాదం!

- 60 మంది చిన్నారులతో వెళ్తుండగా చెట్టును ఢీకొట్టిన బస్సు




**ధరూర్, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** ధరూర్ మండలం జాంపల్లి వద్ద మంగళవారం ప్రైవేటు స్కూల్ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో 60 మంది చిన్నారులు ఉండటంతో తీవ్ర కలకలం రేగింది. కేటిదొడ్డి మండలం నుంచి గద్వాల మండలం సంగాలలోని ప్రైవేటు పాఠశాలకు విద్యార్థులను తీసుకెళ్తుండగా జాంపల్లి శివారులో ఈ ఘటన చోటుచేసుకుంది. బస్సు స్టీరింగ్ విరిగిపోవడం తోనే ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అదృష్టవశాత్తూ పెద్ద ప్రమాదం తప్పగా, చిన్నారులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.
ఈ ఘటనతో ప్రైవేటు పాఠశాలల బస్సుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీస ఫిట్‌నెస్, వాహనాల కండీషన్ పరిశీలించకుండా బస్సులను నడిపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థుల ప్రాణాలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్యాలు, డ్రైవర్లపై ఉందని పలువురు పేర్కొన్నారు. కేవలం ఫీజుల వసూళ్లపై కాకుండా విద్యార్థుల రవాణా భద్రతపై కూడా యాజమాన్యాలు దృష్టి పెట్టాలని కోరుతున్నారు.
ప్రైవేటు స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ తనిఖీల విషయంలో ఆర్టీఓ అధికారుల తీరుపై కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలను గుర్తించి చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యే ముందు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను కాగితాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో కఠినంగా తనిఖీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. చిన్నారుల ప్రాణాలకు ముప్పు కలగకుండా రవాణా శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# యువతను మోసం చేస్తే బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపుతాం

- ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి




**మల్దకల్, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యువతను మోసం చేస్తోందని ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు ఆరోపించారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో యాదగిరిగుట్టలో ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి 11 ఏళ్లుగా నిరుద్యోగులను వంచిస్తున్నారని విమర్శించారు. రైల్వే, ఆర్మీ, ఎస్ఎస్‌సీ తదితర విభాగాల్లో ఖాళీలను భర్తీ చేయకుండా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తున్నారని ఆరోపించారు. అగ్నిపథ్ వంటి పథకాలతో యువత భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు.
రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రెండు లక్షల ఉద్యోగాలు, రూ.4 వేల నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ వంటి హామీలు ఇచ్చినా ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వేల కోట్లకు చేరడంతో పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చదువుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.
రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్, మద్యం ప్రభావంతో యువత తీవ్రంగా నష్టపోతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. యువతకు ఉపాధి కల్పించకుండా మత్తు పదార్థాల వైపు నెట్టడం సరికాదన్నారు. యువతను మోసం చేస్తే భవిష్యత్తులో ప్రభుత్వాల పీఠాలు కూలడం ఖాయమని హెచ్చరించారు. విద్య, వైద్యం, ఉపాధి హక్కుల సాధన కోసం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో యువతను సమీకరించి పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కొండపల్లి రాము, లక్ష్మణ్, రాజశేఖర్, పవన్, బద్రి, గూడుబాషా తదితరులు పాల్గొన్నారు.

# పట్టించుకోని పాలకులు – ప్రమాదాల వంతెన!



**ఇటిక్యాల, సెప్టెంబర్ 8(జనంసాక్షి):** ఇటిక్యాల మండల పరిధిలోని మునగాల శివారులో పీజేపీ కుడి కాలువ వంతెన కూలి పది నెలలు గడుస్తున్నా, సంబంధిత అధికారులు 'నిమ్మకు నీరెత్తినట్లు' వ్యవహరిస్తుండటంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వంతెన ధ్వంసమై ఇన్ని నెలలైనా కనీస మరమ్మతులు కూడా చేయకపోవడంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ కూలిన వంతెన ప్రస్తుతం నిత్యం ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌గా మారింది. రోజువారీ వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు ఈ దారి లేక నరకయాతన అనుభవిస్తున్నారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు ఇక్కడ దారి తెలియక గోతిలో పడి తీవ్ర గాయాలపాలవుతున్నారు. స్థానిక నాయకుల ఆగ్రహం:ఈ విషయమై స్థానిక ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు స్పందిస్తూ.. "వంతెన కూలి పది నెలలు దాటినా పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం దారుణం. రైతులు తమ పంట ఉత్పత్తులను మార్కెట్లకు తరలించలేక, ప్రత్యామ్నాయ దారి లేక కిలోమీటర్ల మేర చుట్టు తిరిగి వెళ్లాల్సి వస్తోంది. వెంటనే స్పందించకుంటే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం" అని హెచ్చరించారు. ఈ సమస్యపై ఇంజనీరింగ్ అధికారులను వివరణ కోరగా వంతెన పునర్నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే ఉన్నతాధికారులకు పంపామని తెలిపారు. నిధులు మంజూరు కాగానే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి, యుద్ధప్రాతిపదికన కొత్త వంతెన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని, అప్పటివరకు తాత్కాలికంగా ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పరిశీలిస్తామని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు ఇప్పటికైనా తమ నిద్ర వీడి, ఈ ప్రమాదకర వంతెన సమస్యపై తక్షణమే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రజలను మోసం చేసిన రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలి

- వెయ్యి రోజులు పూర్తవుతున్నా అమలు కాని హామీలు: బీఆర్ఎస్



**నారాయణపేట, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు విజయ్‌సాగర్ ఆరోపించారు. పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, వెయ్యి రోజులు పూర్తవుతున్నా అనేక హామీలను అమలు చేయలేదన్నారు. ప్రజలు, రైతులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, మహిళల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో పాలన, శాంతిభద్రతలు దెబ్బతిన్నాయని ఆరోపించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై కేసులు, అరెస్టులు, నిర్బంధాలతో ఒత్తిడి తీసుకురావడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నైతిక బాధ్యత వహించి సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నారాయణపేటలో అభివృద్ధి పనులు జరగలేదని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో మండల అధ్యక్షులు వేపూరి రాములు, చెన్నారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కన్నా జగదీష్, శరణపల్లి రాములు, రాంరెడ్డి, గురులింగప్ప, చిన్నయ్య, మొగులప్ప, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక టిప్పర్ పట్టివేత

**కృష్ణ, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** కృష్ణ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. ఉదయం అందాజా ఆరు గంటల సమయంలో కృష్ణ పోలీసులూ గస్తీ తిరుగుతుండగా గుడేబల్లూర్ పరిధిలో టైరోడ్ వద్ద ఒక టిప్పర్ అనుమానాస్పదంగా వెళుతుండగా దానిని ఆపి చెక్ చేయగా దాన్ని నిండా ఇసుక ఉన్నట్లు గుర్తించారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా కృష్ణా నది నుండి యాదగిరి కర్ణాటకకు తరలిస్తున్నందున అ టిప్పరు టిజి38టి3212ను స్టేషన్ కు తరలించి టిప్పర్ డ్రైవర్ డి నరసింహ, టిప్పర్ యజమాని వి.సతీష్ మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కృష్ణ ఎస్ ఐ నవీద్ తెలిపినారు.

## కొడంగల్‌లో టీఆర్ఎస్ బలప్రదర్శనకు సన్నాహాలు

- 10 వేల మందితో కోస్గిలో భారీ బహిరంగ సభ




**మద్దూరు, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** కొడంగల్ నియోజకవర్గంలో టీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేసి రానున్న ఎన్నికలకు సిద్ధమవుతున్నామని నారాయణపేట జిల్లా టీఆర్ఎస్ అధ్యక్షుడు గవినోళ్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల చివర్లో కోస్గిలో సుమారు 10 వేల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కవిత సభకు హాజరవుతారని తెలిపారు. సోమవారం మద్దూరులో బీజేపీ నాయకుడు రాజప్రభాకర్ టీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ, మండల కమిటీలను ఏర్పాటు చేసి ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తూ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.

## స్పీకర్‌పై దాడిని ఖండిస్తూ మద్దూరులో ఎస్సీ సెల్ ధర్నా



**మద్దూరు, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** అసెంబ్లీలో స్పీకర్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ మద్దూరు పట్టణంలోని పాత బస్టాండ్ చౌరస్తాలో ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ప్రతీక అయిన అసెంబ్లీ వేదికపై స్పీకర్‌పై దాడి చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## కోహెడలోని ప్రభుత్వ భూములు కాపాడాలని ప్రజావాణిలో ఫిర్యాదు




**కోహెడ, సెప్టెంబర్ 08 (జనంసాక్షి):** కోహెడ మండల కేంద్రంలోని ప్రభుత్వ భూములు కాపాడాలని కోరుతూ సోమవారం ప్రజావాణి లో పిర్యాదు చేసాడు. మండల కేంద్రానికి చెందిన నరాల శ్రీకాంత్ గ్రామంలోని ప్రభుత్వ భూములు, గ్రామ కంఠం, పరం పోగు భూముల ఆక్రమణలు, అనధికార నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నరాల శ్రీకాంత్ ఈనెల 07 తేదీన ప్రజావాణిలో ఫిర్యాదు అందించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించి, ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని లేదంటే కొద్ది కాలంలోనే అవి పూర్తిగా అక్రమార్కుల చేతిలోకి పోయి ప్రభుత్వం యొక్క ఆదాయానికి గండి పడుతుందని వెంటనే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఇప్పటికే గ్రామ శివారులోని కొంత భూమి వారి చేతుల్లోకి పోయిందని ఆయన అన్నారు.

# బీఎల్ఓలకు శిక్షణ సదస్సు





**సదాశివపేట, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** మున్సిపల్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ హరిచంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో బీఎల్ఓలకు శిక్షణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో నోటీసులు జారీ చేసిన అనంతరం డాక్యుమెంట్ల అప్‌లోడింగ్‌లో ఎదురయ్యే సాంకేతిక సమస్యలపై బీఎల్ఓలకు అవగాహన కల్పించారు. నోటీసులు అందిన ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని వారికి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కిరణ్, ఆరిఫ్, ఆర్ఐలు సాయి, మంజులత, మున్సిపల్ డబ్ల్యూఓ స్వామి, ట్రైనర్ మల్లేశం, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయడమే మన ఏకైక లక్ష్యం

- **డిసిసి అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి**



**సంగారెడ్డి, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** సంగారెడ్డి పట్టణంలో మంగళవారం నిర్వహించిన తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ సంఘటన్ సృజన్ అభియాన్‌లో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిర్మలా జగ్గారెడ్డి, హాజరైన ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర వైస్ చైర్మన్ లింగం నాయక్. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిగా చేయడమే ఏకైక లక్ష్యంగా ప్రతీ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సంగారెడ్డి పట్టణం లో జరిగిన ఆదివాసి కాంగ్రెస్ జిల్లా కమిటీ ఎన్నికకోసం ఏర్పాటుచేసిన సంఘటన్ సృజన్ కార్యక్రమం లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకముందునుండి దేశ ప్రజలకు సేవ చేస్తున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. స్వర్గీయ ఇందిరా గాంధీ ఆదివాసీలకు ప్రత్యేక గుర్తింపు నిచ్చారని గుర్తు చేశారు.

కార్యక్రమానికి హాజరైన ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర వైస్ చైర్మన్ లింగం నాయక్ మాట్లాడుతూ ఆదివాసీలు, యానాదిలు, చెంచులు మొదటినుండి కాంగ్రెస్ పార్టీ కి అండగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్న ప్రతీ గిరిజనుడి కి గుర్తింపు ఇచ్చేందుకు సంఘటన్ సృజన్ అభియాన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు జిల్లా కమిటీ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్,జిల్లా అధ్యక్షుడు రామ్ చందర్ నాయక్, ఇంచార్జ్ కిషన్ నాయక్,బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ జార్జ్, టౌన్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ ప్రాంతాలకు ఉపాధి హామీ చట్టం వర్తింపచేయాలి

## భూమిలేని పేదలకు రూ.12 వేల ఆత్మీయ భరోసా అందించాలి: ఆర్.వెంకట్రాములు

**అమరచింత, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** పట్టణ ప్రాంతాలకు కూడా ఉపాధి హామీ చట్టాన్ని వర్తింపజేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు డిమాండ్ చేశారు. మంగళవారం అమరచింత జీవిస్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు ఎస్.అజయ్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూమిలేని పేదలకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం అందించేందుకు తగిన బడ్జెట్ కేటాయించాలని కోరారు.

2023 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పట్టణ మున్సిపాలిటీలకు కూడా ఉపాధి హామీ చట్టాన్ని వర్తింపజేసేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అసైన్డ్, పోడు భూములు సాగు చేస్తున్న దళితులు, గిరిజనులకు హక్కు పత్రాలు ఇవ్వాలని, కోనేరు రంగారావు కమిషన్ సిఫార్సుల మేరకు భూమిలేని పేద కుటుంబాలకు రెండెకరాల చొప్పున భూమి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లు లేని పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయాలని, ఆహార భద్రత చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించి, రేషన్ దుకాణాల




ద్వారా పేదలకు సబ్సిడీపై నిత్యావసర సరుకులు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధి హామీ చట్టం నిధుల్లో కేంద్రం వాటాను తగ్గించడం, రాష్ట్రాల వాటాను పెంచడం దుర్మార్గమైన చర్యగా ఆయన విమర్శించారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలను అడ్డుకునేందుకు ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 18, 19 తేదీల్లో హైదరాబాద్‌లో రాష్ట్ర కమిటీ సమావేశాలు నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ఖరారు చేస్తామని తెలిపారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు కే.శంకర్, ఎన్.రాజు పాల్గొన్నారు.

# 31వ వార్డు కౌన్సిలర్ సతీష్‌రెడ్డికి సన్మానం

- **స్వచ్ఛ వాయు సర్వేక్షణ అవార్డుపై అభినందనలు**



**సంగారెడ్డి, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** స్వచ్ఛ వాయు సర్వేక్షణ-2026 రాష్ట్రస్థాయి అవార్డుకు సంగారెడ్డి మున్సిపాలిటీ 31వ వార్డు ఎంపిక కావడంతో కౌన్సిలర్ జగ్గరి సతీష్‌రెడ్డిని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి మంగళవారం సన్మానించారు. వార్డులో 100 శాతం డోర్‌టు డోర్ చెత్త సేకరణ, 60 శాతం సోర్స్ సెగ్రిగేషన్, గ్రీన్ డెవలప్‌మెంట్, డ్రైనేజీ క్లీనింగ్ వంటి కార్యక్రమాలకు గుర్తింపు లభించింది. అవార్డుతో పాటు వార్డు అభివృద్ధికి రూ.10 లక్షల రివార్డు దక్కిందని సతీష్‌రెడ్డి తెలిపారు. అవార్డు సాధనకు సహకరించిన అధికారులు, ప్రజలను జగ్గారెడ్డి, నిర్మల అభినందించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ షఫీ హఫీజ్, నాయకులు పాల్గొన్నారు.

## గణేష్ మండపాల

# నిర్వాహకులు సమన్వయం పాటించాలి

- **పోలీసులతో సహకరించి ప్రశాంతంగా ఉత్సవాలు నిర్వహించాలి: సీఐ రవికుమార్**



**కోహిర్, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు పోలీసులతో సమన్వయం పాటించాలని జహీరాబాద్ సీఐ రవికుమార్ సూచించారు. కోహిర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మండపాల నిర్వాహకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎస్ఐ నరేష్ సమక్షంలో ఉత్సవాల నిబంధనలు, భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. ప్రతి మండపానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి సంబంధిత శాఖల అనుమతులు పొందాలని తెలిపారు. విద్యుత్ వైరింగ్, షార్ట్‌సర్క్యూట్, అగ్నిప్రమాదాల విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధిక శబ్దంతో డీజేలు, లౌడ్‌స్పీకర్లు వినియోగించవద్దని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. యువత అత్యుత్సాహానికి లోనుకాకుండా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని, అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. శాంతియుతంగా ఉత్సవాలు నిర్వహించేందుకు పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని సీఐ రవికుమార్, ఎస్ఐ నరేష్ కోరారు.

# హామీలను అమలు చేయాలని అంబేద్కర్ విగ్రహానికి వినతి



**బిజినేపల్లి, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో తెలంగాణ ప్రజలకు ఇచ్చిన 420 హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ మండల రైతు సమితి అధ్యక్షుడు నెల్లికంటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అనేక హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. రైతు భరోసా, పెట్టుబడి సాయం, ఉద్యోగాలు, విద్యా భరోసా, ఫీజు బకాయిలు, పెన్షన్ల పెంపు వంటి హామీలు నెరవేర్చలేదన్నారు. హామీలు అమలు చేసే వరకు బీఆర్ఎస్ ఉద్యమాలను ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గుండుమాల్‌లో రైతులకు ఆధునిక సాగుపై శిక్షణ

- **ఆత్మ ఆధ్వర్యంలో ఆర్‌పీఎల్ శిక్షణ..**
- **నానో ఎరువుల వినియోగంపై క్షేత్ర ప్రదర్శన**




**గుండుమాల్, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ, నారాయణపేట జిల్లా కోస్గి డివిజన్ పరిధిలోని గుండుమాల్ మండలంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో రికగ్నిషన్ ఆఫ్ ప్రియర్ లెర్నింగ్ (అర్ పి ఎల్) రైతుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయంలో ఇప్పటికే అనుభవం కలిగిన రైతుల నైపుణ్యాలను గుర్తించి, వాటిని మరింత మెరుగుపరిచేందుకు ఈ శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఆధునిక సాగు పద్ధతులు, పంటల నిర్వహణ, విత్తన శుద్ధి, ఎరువుల సమర్థ వినియోగం, పురుగులు మరియు పంట వ్యాధుల నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా పంటల దిగుబడి, రైతుల ఆదాయం పెంచుకోవచ్చని వివరించారు.

అనంతరం ఆత్మ సహకారంతో గుండుమాల్ మండల కేంద్రంలోని రైతు సుధాకర్ రెడ్డి పొలంలో నానో ఎరువులు, నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. నానో ఎరువులను శాస్త్రీయ పద్ధతిలో, సిఫారసు చేసిన మోతాదులో ఉపయోగించడం ద్వారా ఎరువుల వినియోగ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని అధికారులు తెలిపారు. రైతుల సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు, స్థిరమైన వ్యవసాయ అభివృద్ధికి ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ శాంతి నిర్మల, ఏడీఏ రామకృష్ణ, ఏఓ రేష్మ రెడ్డి, ఏఈఓలు హర్ష వర్ధన్, కే తిరుపతి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# అకాల మృతుల కుటుంబాలకు నిరంజన్ రెడ్డి పరామర్శ



**వనపర్తి రూరల్, సెప్టెంబర్ 08 (జనంసాక్షి):** పట్టణంలో ఇటీవల అకాల మరణం చెందిన పలువురి కుటుంబాలను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాయిగడ్డకు చెందిన గొడుగు నాగరత్నమ్మ, బసవన్నగడ్డకు చెందిన హోంగార్డు నేమకల కిరణ్ కుమార్ గౌడ్ మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అదేవిధంగా 17వ వార్డుకు చెందిన గఫార్ మృతి విషయం తెలుసుకుని ఆయన కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శల్లో టీఎస్ఎంఎఫ్‌సీ ఇంతియాజ్, మాజీ కౌన్సిలర్ వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, గంధం పరంజ్యోతి, లక్ష్మీనారాయణ, ప్రేమ్‌నాథ్ రెడ్డి, స్టార్ రహీం, జోహెబ్ హుస్సేన్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

### వరి విత్తనాలకు బోనస్..

## రైతులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి



**నర్సాపూర్ సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** ప్రభుత్వం సిఫారసు చేసిన ఏడు రకాల వరి విత్తనాలను సాగు చేసిన రైతులకు బోనస్ అందించేందుకు నమోదు ప్రక్రియ చేపడుతున్నట్లు మండల వ్యవసాయ అధికారులు తెలిపారు. మంతూర్, ఆవంచ, చిప్పల్తుర్తి గ్రామాల్లో రైతులకు వ్యవసాయ విస్తరణ అధికారులు ఈ విషయంపై అవగాహన కల్పించారు.ప్రభుత్వం సిఫారసు చేసిన వరి రకాలలో బీపీటీ-5204 (సాంబ మసూరి), కేఎన్ఎం-1638, కేఎన్ఎం-7715, జై శ్రీరామ్, హెచ్ఎంటీ, డబ్ల్యూజీఎల్-44, ఆర్ఎన్ఆర్-15048 (తెలంగాణ సోనా) ఉన్నాయి.రైతులు తాము విత్తనం కొనుగోలు చేసిన డీలర్ వద్ద తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. సొంతంగా విత్తనం వినియోగించిన రైతులు లేదా పరిశోధన స్థానాలైన కేవీకే, ఏఆర్ఎస్‌ల నుంచి విత్తనాలు కొనుగోలు చేసిన వారు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి స్వీయ ధ్రువీకరణ పత్రాన్ని అందజేయాలని తెలిపారు. పైన పేర్కొన్న రకాల వరిని సాగు చేసిన రైతులందరూ తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని అధికారులు సూచించారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచులు వెంకటేశం, స్రవంతి కరుణాకర్, సుధాకర్, ఉపసర్పంచ్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు రాజశేఖర్, లావణ్య, తేజస్విని, రైతులు పాల్గొన్నారు.

## ఫీజు బకాయిలు విడుదల చేయాలి

- ప్రశ్నిస్తే ముందస్తు అరెస్టులా?
- బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ దొడ్ల ప్రశాంత్




**బెజ్జంకి, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద శాంతి యుత నిరసనకు సిద్ధమైతే ప్రభుత్వం అనుమతులు నిరాకరించడం సిగ్గుచేటని బీజేపీ బెజ్జంకి మండల సోషల్ మీడియా కన్వీనర్ దొడ్ల ప్రశాంత్ విమర్శించారు.చలో అసెంబ్లీకి పిలుపునిచ్చిన నేపథ్యంలో బీజేపీ,బీజేవైఎం నాయకులు,కార్యకర్తలను ముందస్తుగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తూ,ప్రశ్నించే నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు.అరెస్టులతో బీజేపీ ఉద్యమాన్ని అడ్డుకోలేరని స్పష్టం చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వంలాగే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రశ్నించే గొంతులను అణచివేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.ప్రభుత్వం వెంటనే ఫీజు బకాయిలను విడుదల చేసి,అరెస్టు చేసిన బీజేపీ,బీజేవైఎం నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థుల భవిష్యత్తు కోసం మరింత ఉధృతంగా ప్రజా ఉద్యమం చేపడతామని దొడ్ల ప్రశాంత్ హెచ్చరించారు.

## మండలస్థాయి కబడ్డీలో శాంతినికేతన్ విద్యార్థుల సత్తా

### అండర్-14లో ప్రథమస్థానం.. జిల్లా స్థాయికి ఎంపిక



**తెలకపల్లి, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి ఆటల పోటీల్లో శాంతి నికేతన్ విద్యాలయం విద్యార్థులు ప్రతి భ కనబరిచారు. అండర్-14 కబడ్డీ విభాగంలో ప్రథమస్థానం సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడలతో క్రమశిక్షణ, స్నేహభావం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని అన్నారు. పోటీల్లో సుమారు 720 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు.

## వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

- డీజేలకు అనుమతి లేదు: ఎస్ఐ పుట్ట మహేష్




**ఉప్పునుంతల, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలు పాటించాలని ఎస్ఐ పుట్ట మహేష్ కోరారు. మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో అనుమతి తీసుకోవాలని, ప్రజా రవాణాకు ఆటంకం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. విద్యుత్ కనెక్షన్‌కు విద్యుత్ శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కమిటీ, బాధ్యులు, ఫోన్ నంబర్ల వివరాలను ప్రదర్శించాలని, 24 గంటల నిఘా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు, బ్యాగులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే 112కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఉత్సవాల నిర్వహణలో అందరూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## స్పీకర్‌పై వ్యాఖ్యలను ఖండిస్తూ పటాన్‌చెరులో కాంగ్రెస్ నిరసన

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీని తక్షణమే సస్పెండ్ చేయాలి కాట సుధా శ్రీనివాస్ గౌడ్





**పటాన్చెరు, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ చేసిన అహంకారపూరిత, అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం నాడు పటాన్చెరులో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. పటాన్‌చెరు డివిజన్‌లోని స్థానిక గాంధీ పార్క్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వైఖరిని ఖండిస్తూ నినాదాలు చేశారు.
ఈ సందర్భంగా జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ప్రజాప్రతినిధులు హుందాతనంతో వ్యవహరిస్తూ రాజ్యాంగ విలువలను గౌరవించాలని సూచించారు. స్పీకర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆయనను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ పదవులకు, ప్రజాస్వామ్య వ్యవస్థకు గౌరవం ఉండేలా ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన, మహిళా నాయకులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## భవానీ మందిర్ రోడ్డు విస్తరణకు సహకరించాలి

- వ్యాపారులతో మున్సిపల్ కమిషనర్ సమన్వయ సమావేశం



**జహీరాబాద్, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** జహీరాబాద్ పట్టణంలోని భవానీ మందిర్ రోడ్డు విస్తరణ పనులకు దుకాణ యజమానులు, ఆక్యుపెంట్లు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్ కోరారు. ఈ మేరకు మంగళవారం జహీరాబాద్ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కలిసి భవానీ మందిర్ రోడ్డులోని దుకాణ యజమానులు, ఆక్యుపెంట్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిపాదిత రోడ్డు విస్తరణ పనులపై వ్యాపారులకు అధికారులు వివరించారు. రహదారి విస్తరణతో ప్రజలు, వాహన దారులకు మరింత సౌకర్యం కలగడంతో పాటు పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గే అవకాశం ఉందని తెలిపారు. పనులు సజావుగా సాగేందుకు దుకాణ యజమానులు, ఆక్యుపెంట్లు మున్సిపాలిటీకి సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. రోడ్డు విస్తరణ పనుల అమలులో ఎదురయ్యే సమస్యలను పరస్పర సమన్వయంతో పరిష్క రించుకుంటామని అధికారులు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది, భవానీ మందిర్ రోడ్డులోని దుకాణ యజమానులు, ఆక్యుపెంట్లు పాల్గొన్నారు.

## తాతా మధు వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ భారీ ర్యాలీ




**బెజ్జంకి,సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై పరుష పదజాలంతో, అవమానకరంగా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం బెజ్జంకి మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వంద డప్పుల చప్పుళ్లతో ర్యాలీ చేపట్టారు.తాతా మధు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం దళిత వ్యతిరేకి కేసీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా నాయకులు ఫ్యాక్స్ ఛైర్మన్ ఒగ్గు దామోదర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న గుండాగిరిని ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారనరు అనీ అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అక్కరవేణి పోచయ్య, మార్కెట్ కమిటీ ఛైర్మన్ పులి కృష్ణ,మాజీ మండల అధ్యక్షులు ముక్కిసరత్నాకర్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గూడెల్లి శ్రీకాంత్‌తో పాటు, అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమర ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలి

- ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం డిమాండ్..



**నారాయణఖేడ్, సెప్టెంబర్ 08 (జనంసాక్షి):**
రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత, అవమానకర వ్యాఖ్యలు చేసిన అమర ప్రసాద్‌పై ప్రభుత్వం వెంటనే స్పందించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు.
నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా సెక్రటరీ అనుముల తుకారం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా అంబేద్కర్‌ను అవమానించేలా చేసిన వ్యాఖ్యలను నాయకులు తీవ్రంగా ఖండించారు.
ఈ సందర్భంగా అనుముల తుకారం మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేయడం కోట్లాది మంది ప్రజల మనోభావాలను దెబ్బతీయడమేనని అన్నారు. మహనీయులపై ఇలాంటి వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ఇటువంటి వ్యాఖ్యలు సమాజంలో ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం ఉన్నందున ప్రభుత్వం వెంటనే స్పందించి, అమర ప్రసాద్‌పై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
అంబేద్కర్ ఆశయాలు, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు అవసరమైతే మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని నాయకులు హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కారస్ గుత్తి, గణపతి, రహీం, శంకరన్న, కాశయ్య, భీంసేనతో పాటు అంబేద్కర్ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పటాన్చెరులో బిఆర్ఎస్ నిరసన ర్యాలీ

- నిరసనను అడ్డుకున్న కాంగ్రెస్ శ్రేణులు.. తిరగబడిన బిఆర్ఎస్ కార్యకర్తలు..
- హామీలు అమలు చేయమంటే అరెస్టులు.. దాడులు.. దౌర్జన్యాలు..

**పటాన్చెరు సెప్టెంబర్ 8(జనంసాక్షి):** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బిఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడిని నిరసిస్తూ పటాన్చెరు పట్టణ వేదికగా బిఆర్ఎస్ మహిళా శ్రేణులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై మహిళా నాయకులు, కార్యకర్తలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమను కాంగ్రెస్ శ్రేణులు అడ్డుకునేందుకు ప్రయత్నించాయని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు.

"బీఆర్ఎస్ మహిళా శాసన సభ్యురాళ్లపై దాడి సిగ్గుచేటు" అంటూ మహిళా శ్రేణులు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. మహిళల పట్ల దురుసుగా వ్యవహరించిన ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తున్నారని, ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును ఎవరూ అడ్డుకోలేరని వారు పేర్కొన్నారు.

గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య బద్ధంగా..రాజ్యాంగం ఇచ్చిన హక్కుకు అనుగుణంగా తమ పార్టీ కార్యకర్తలు నాయకులతో కలిసి శాంతియుత నిరసన కార్యక్రమం చేపడుతుంటే.. అధికార కాంగ్రెస్ పార్టీ అడ్డుకునేందుకు ప్రయత్నం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. తెలంగాణ ఆడబిడ్డలకు పోరాటాలు కొత్త కాదని.. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చరమగీతం పాడేంతవరకు నిరంతర పోరాటాలు చేస్తూనే ఉంటామని వారు హెచ్చరించారు..




పటాన్చెరు బిఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు మార్మోగాయి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, నిరంతరం పోరాటం చేస్తామని బీఆర్ఎస్ శ్రేణులు స్పష్టం చేశాయి.

## విలేకరులను అవమానించిన ఆలయ ఈవో

- క్షమాపణ చెప్పాలని ప్రెస్‌క్లబ్ డిమాండ్



**కొడిపల్లి, సెప్టెంబర్ 8(జనంసాక్షి):** తునికి శ్రీ నల్లపోచమ్మ ఆలయంలో హుండీ లెక్కింపు అనంతరం ఈవో రంగారావును మర్యాదపూర్వకంగా కలిసేందుకు వెళ్లిన విలేకరులతో ఆయన అవమానకరంగా మాట్లాడారని ప్రెస్‌క్లబ్ నిర్వాహకులు ఆరోపించారు. "మిమ్మల్ని ఎవరు రమ్మన్నారు?" అంటూ ప్రశ్నించడాన్ని ఖండించారు. ఈవో వెంటనే క్షమాపణ చెప్పాలని ప్రెస్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగరాజు చారి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.ద

## తహసిల్దార్ కార్యాలయానికి జిరాక్స్ ప్రింటర్ అందజేత



**నిజాంపేట,సెప్టెంబర్ 8(జనంసాక్షి):** నిజాంపేట తహసిల్దార్ కార్యాలయానికి రాంపూర్ గ్రామ సర్పంచ్ పోన్నబోయిన ప్రవీణ్ జిరాక్స్ ప్రింటర్ను మంగళవారం తహసిల్దార్ శ్రీనివాస్, నాయాబ్ తహసిల్దార్ రమ్యశ్రీ కి అందజేశారు. కార్యాలయ కార్యక్రమాలకు, ప్రజలకు సేవలు వేగంగా అందించేందుకు జిరాక్స్ ప్రింటర్ అవసర పడుతుందని పేర్కొన్నారు. మీ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనిల్, సయ్యద్, స్వామి తదితరులు ఉన్నారు.

## కేసీఆర్‌పై కుట్రలను సహించం

- కాంగ్రెస్ వైఖరిని ఖండించిన బీఆర్ఎస్ నేత పైతర సాయికుమార్



**మునిపల్లి, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పైతర సాయికుమార్ ఆరోపించారు. మునిపల్లి బుదేరా చౌరస్తాలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కేసీఆర్‌పై కుట్రలకు తెరలేపుతున్నారని, ఫామ్‌హౌస్ వద్దకు కాంగ్రెస్ కార్యకర్తలను తరలించే ప్రయత్నాలను ఖండిస్తున్నామని అన్నారు. ప్రజా సమస్యలు, ఎన్నికల హామీల అమలుపై దృష్టి పెట్టకుండా ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. కేసీఆర్ భద్రత విషయంలో నిర్లక్ష్యం చేస్తే ప్రజలు సహించబోరని హెచ్చరించారు. రాజకీయ విభేదాలు ఉన్నా వ్యక్తిగత దాడులు, బెదిరింపులు ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. కుట్ర రాజకీయాలు వీడి హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## విద్యుత్ సమస్య పరిష్కరించాలని ఎంపీకి వినతిపత్రం



**తూప్రాన్, సెప్టెంబర్ 8(జనంసాక్షి):** ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ మెదక్ ఎంపీ రఘునాథన్ రావుకు గ్రామ సర్పంచ్ రాజనర్సింహా ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. విద్యుత్ గురించి గౌరవ ఎంపీ రఘునందన్ రావు వెంటనే ఎస్సీ కి ఫోన్ చేసి160 కె.వి ట్రాన్స్ఫార్మర్ 3 ఫేస్ కరెంట్ ఇవ్వాలని చెప్పారు. ఒక అండర్ గ్రౌండ్ సంప్ డ్రైనేజీ గురించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజా నర్సింహా, ఉప సర్పంచ్ రామ్ రెడ్డి వార్డ్ సభ్యులు బీజేపీ నాయకులు నర్సింలు వెంకటేష్ లు పాల్గొన్నారు.

## ఇటిక్యాల రైతులకు నెట్టెంపాడు కాలువ సాగునీరు

**ఇటిక్యాల సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** ఎంతో కాలంగా సాగునీటి కోసం ఎదురుచూస్తున్న ఇటిక్యాల రైతులకు ఊరట లభించింది. నెట్టెంపాడు 99 ప్యాకేజీ కాల్వ పనులు అసంపూర్తి ఉండడంతో గత ఎంతో కాలంగా రైతులకు సాగునీరు అందలేదు. కాలువలో పూడికతీత, లైనింగ్ పనులు అసంపూర్తిగా ఉండడంతో ఆయకట్టు రైతులకు సాగునీరు అందలేదు.

ఇటిక్యాల, బుద్దారెడ్డిపల్లి, శనగపల్లి, ఉదండపురం, నక్కలపల్లి, పెద్దదిన్నె, షాబాద్, చాగాపురం గ్రామాల రైతులకు 100వ ప్యాకేజ్ కాలువ నుంచి సాగునీటి విడుదలతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. పంట సాగుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సాగునీరు విడుదల కావడం సంతోషదాయకమన్నారు.

## గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

- మండపాల నిర్వాహకులకు సీఐ రవి, ఎస్ఐ వినయ్‌కుమార్ సూచనలు



**మొగుడంపల్లి, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులతో పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ రవి, ఎస్ఐ వినయ్‌కుమార్ మాట్లాడుతూ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు. మండపాలకు పోలీస్, విద్యుత్ శాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, భద్రతా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజలు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీజేలకు అనుమతి లేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్పంచ్‌లు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## రంగంపేటలో ఘనంగా మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



**కొల్చారం, సెప్టెంబర్ 08(జనంసాక్షి):** కొల్చారం మండలంలోని రంగంపేటలో మండలస్థాయి పాఠశాల క్రీడా పోటీలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఉమారాణి క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి, పోటీలను అధికారికంగా ప్రారంభిం చారు. అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించి, క్రీడల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. మండల విద్యాధికారి ఉమారాణి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి, క్రమశిక్షణ, ఐక్యత మరియు నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు విజయ్ కుమార్ , ఎస్ జి ఎఫ్ కార్యదర్శి శ్రీధర్ రెడ్డి మండలంలోని వివిధ పాఠశాలల నుంచి పీఈటీలు ఉపాధ్యాయులు, క్రీడాకార విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.


## వ్యసనాలకు చెక్.. విద్యార్థుల భవిష్యత్తుకు సేఫ్!

### మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుతారు : హెచ్ఎం జిల్లెల సురేందర్ రెడ్డి



**గోపాల్‌పేట, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉంటూ విద్యపై ఏకాగ్రత పెంచుకుంటే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగవచ్చని పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ పాఠశాల హెచ్‌ఎం ఎఫ్ఏసీ జిల్లెల సురేందర్ రెడ్డి అన్నారు. నషాముక్త్ భారత్ అభియాన్, మిషన్ స్పందన ఆధ్వర్యంలో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం వనపర్తి శాఖ సహకారంతో మంగళవారం పాఠశాలలో వ్యసన విముక్తి ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనం, సామరస్య కుటుంబం, ఉజ్వల భవిష్యత్తు, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణం కోసం మత్తు పదార్థాలకు దూరంగా ఉండటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. సమాజహితం కోసం నిర్వహిస్తున్న వ్యసన విముక్తి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులతో వ్యసన విముక్తి ప్రతిజ్ఞ చేయించారు. అన్ని రకాల మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని, కుటుంబ సభ్యులు, స్నేహితులు వాటికి దూరంగా ఉండేలా అవగాహన కల్పిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఆరోగ్యకరమైన, సంతోషకరమైన సమాజ నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామని, భారతదేశాన్ని మాదకద్రవ్య రహిత దేశంగా మార్చేందుకు కృషి చేస్తామని ప్రమాణం చేశారు.



బ్రహ్మకుమారి కేంద్రం ప్రతినిధులు బీకే నాగమణి, బీకే శోభ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండటం వల్ల మెరుగైన ఆరోగ్యం, మనశ్శాంతి, ఉజ్వల భవిష్యత్తు, ఆర్థిక అభివృద్ధి, సత్సంబంధాలు, సానుకూల జీవనశైలి అలవడతాయని తెలిపారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ విద్యపై దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సహాయకులు గంధం భక్తరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఓటర్లకు ముఖ్య హెచ్చరిక.. నోటీసులను నిర్లక్ష్యం చేయొద్దు

- గడువులోగా ధృవీకరణ పత్రాలు సమర్పించాలి
- మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతిరాజ్
- మెదక్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ



**మెదక్ టౌన్ సెప్టెంబర్ 08, (జనంసాక్షి):** ఎస్ ఐ అర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ప్రతి ఓటరు వాటిని నిర్లక్ష్యం చేయకుండా, నిర్దేశిత గడువులోగా సంబంధిత ధృవీకరణ పత్రాలు, అవసరమైన ఆధారాలను అధికారులకు సమర్పించాలని మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి కానుగు రాధిక భూపతిరాజ్ సూచించారు. గడువు ముగిసేలోపు నోటీసులకు స్పందించకపోతే, ఓటరు జాబితాలో తమ పేరుకు సంబంధించి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని, తద్వారా తమ ఓటు హక్కుకు తామే నష్టం చేసుకున్నట్టవుతుందని ఆమె హెచ్చరించారు. ప్రతి ఓటరు బాధ్యతగా వ్యవహరించి, సవరణ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**27వ వార్డులో (ఎస్ ఐ ఆర్) శిబిరం ఆకస్మిక తనిఖీ...**

మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతిరాజ్ 27వ వార్డులో నిర్వహిస్తున్న (ఎస్ ఐ అర్) ఓటర్ నోటీసుల సవరణ శిబిరాన్ని ఆకస్మికంగా సందర్శించారు.

ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన ఓటర్లతో ఆమె నేరుగా మాట్లాడి, నోటీసుల సవరణ ప్రక్రియ, సమర్పించాల్సిన ధృవీకరణ పత్రాలు, అవసరమైన ఆధారాలు తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. నోటీసులు అందుకున్న ప్రతి ఒక్కరూ ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా, గడువులోగా ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.

అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను సరిచూసుకుని, అవసరమైన సవరణలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆమె పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉన్న ఈ అవకాశాన్ని ప్రతి ఓటరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 27వ వార్డు కౌన్సిలర్ రాణి బాలరాజ్, చెదల నవీన్, భువన చంద్ర రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు.. కేసు నమోదు

- ఫిర్యాదు దారుడు గోండ కృష్ణ

**కొల్చారం, సెప్టెంబర్ 09 (జనంసాక్షి):** కొల్చారం మండలంలోని రంగంపేట గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తిపై కొల్చారం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో విడుదల చేసిన మేనిఫెస్టోతో పాటు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి అసభ్యకర, అవమాన కర పదజాలంతో దూషించినట్లు ఫిర్యాదు అందినట్లు పోలీసులు తెలిపారు. సదరు వ్యక్తి తన వ్యాఖ్యలను సెల్‌ఫోన్‌లో వీడియోగా చిత్రీకరించి, వాటిని వాట్సాప్ స్టేటస్‌లో ఉంచడంతో పాటు ఇతరులకు వాట్సాప్ ద్వారా షేర్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు రంగంపేట గ్రామానికి చెందిన గోండ కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొల్చారం ఎస్సై మహమ్మద్ మోహీనుద్దీన్ తెలిపారు.


## ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌కు బీఆర్‌ఎస్ నేతల తరలింపు

- కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై తీవ్ర విమర్శలు



**చేర్యాల, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** మాజీ సీఎం కేసీఆర్ ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ ముట్టడికి కాంగ్రెస్ పిలుపునివ్వడం ప్రజాస్వామ్య విరుద్ధమని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీలు బద్దిపడగే కృష్ణారెడ్డి, ఉల్లంపల్లి కర్ణాకర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోల్ చంటి విమర్శించారు. బీఆర్‌ఎస్ శ్రేణులను ముందస్తు అరెస్టు లు చేయడాన్ని ఖండించారు. మహిళా ఎమ్మెల్యేలపై అనుచితంగా వ్యవహరించిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు గౌరవం ఇవ్వడం లేదని ఆరోపించారు. రానున్న రోజుల్లో ప్రజలు కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. అనంతరం పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఎర్రవెల్లికి తరలివెళ్లారు.

## స్కూల్ బస్సు కింద పడి రెండేళ్ల బాలుడు మృతి..



**సదాశివపేట, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో విషాదం చోటుచేసుకుంది. స్కూల్ బస్సు కిందపడి రెండేళ్ల బాలుడు మృతి చెందాడు. సిద్దాపూర్ కృష్ణానగర్ కాలనీకి చెందిన టైటాస్ విద్యార్థి పాఠశాల నుండి స్కూల్ బస్సులో ఇంటికి రాగా, అన్నను చూసిన తమ్ముడు ఎగ్రాయిర్ జీనియస్ స్కూల్ బస్సు నుండి తీసుకురావడానికి వెళ్ళాడు. బస్ డ్రైవర్ గమనించ కుండా బస్సును వెనకకు తీయడంతో టైర్ కిందపడి బాలుడు మృతి చెందాడు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు



**తెలకపల్లి, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** కర్వంగా రైతు వేదికలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయం పై ఏడీఏ పూర్ణచంద్రరెడ్డి, ఏవో నర్మద అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంతో సాగు ఖర్చులు తగ్గడంతో పాటు నేల ఆరోగ్యాన్ని పరిరక్షించవచ్చన్నారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సహజ పద్ధతులు పాటించాలని సూచించారు. జీవామృతం, ఘన జీవామృతం, బీజామృతం, సహజ కషాయాల తయారీ, వినియోగంపై వివరించారు. అనంతరం ఎంపికైన లబ్ధిదారులకు ప్రకృతి వ్యవసాయ కిట్లు పంపిణీ చేశారు. గ్రామంలో సాగవుతున్న పత్తి పంటలను పరిశీలించి రైతులకు సూచనలు అందించారు. కార్యక్రమంలో ఏఈవోలు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థుల మనోవికాసానికి పుస్తక పఠనం కీలకం

- నిరుపేద విద్యార్థులకు డాక్టర్ పెంటా గౌడ్ పుస్తకాల పంపిణీ




**మెదక్, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** విద్యార్థుల్లో జ్ఞానం, ఆలోచనా శక్తి, వ్యక్తిత్వ వికాసానికి పుస్తక పఠనం ఎంతో దోహదపడుతుందని పట్టణ వైద్యులు డాక్టర్ పెంటా గౌడ్ అన్నారు. మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు సామాజిక బాధ్యతగా బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ తదితర పాఠ్య పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు.

ఈ పుస్తకాలను మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. నిరుపేద విద్యార్థులకు విద్యాపరంగా అండగా నిలిచి పుస్తకాలు అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సింహారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. జంతుశాస్త్ర అధ్యాపకుడు వినోద్ కుమార్ ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ నిర్వహించారు.

## విధి నిర్వహణలో హెడ్ కానిస్టేబుల్ ఆనందం మృతి

### తూప్రాన్‌లో ఛాతినొప్పితో కుప్పకూలి.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత



**తూప్రాన్, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** విధి నిర్వహణకు వెళ్లిన హెడ్ కానిస్టేబుల్ ఆనందం (54) ఆకస్మికంగా మృతి చెందారు. మెదక్ జిల్లా ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ క్యూఆర్టీలో విధులు నిర్వహిస్తున్న ఆయన మంగళవారం చెక్‌పోస్ట్ విధుల కోసం తూప్రాన్ వెళ్లారు.

అక్కడ ఛాతినొప్పి రావడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈసీజీ చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో సిబ్బంది సీపీఆర్ చేశారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మేడ్చల్‌లోని మెడినోవా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఆనందం సహచరులతో కలిసిమెలిసి, విధుల్లో చురుగ్గా ఉంటూ మంచి పేరు తెచ్చుకున్నారని తోటి సిబ్బంది తెలిపారు. ఆయన మృతితో పోలీసు శాఖలో విషాదం నెలకొంది.

జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. పోలీసు శాఖకు ఆనందం అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు సంగారెడ్డి జిల్లా మల్కాపూర్‌లో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఎస్పీ తెలిపారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలి

- గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య పిలుపు



**రాయికోడ్, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** ఎస్ఐఆర్ ప్రక్రియను విజయ వంతంగా పూర్తి చేయా లని జిల్లా గ్రంథాలయ చైర్మన్ జి.అంజయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని నాగ్వార్ గ్రామంలో ఎస్ఐఆర్‌కు సంబంధించిన నోటీస్ ఫారాల సేకరణకు సంబంధించిన గ్రామసభలో ఆయన ఎంపీడీవో ఎంఏ షరీఫ్ తో కలిసి పాల్గొన్నారు. అనంతరం చైర్మన్ అంజయ్య పాల్గొని, ఎస్ఐఆర్‌కు సంబంధించిన ఫారాలు మరియు వాటితో జత చేసిన వివరాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా చైర్మన్ అంజయ్య మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా అధికారులు, సిబ్బందికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా అవసరమైన పత్రాలను సమర్పించాలని సూచించారు.ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత సిబ్బందిని సంప్రదించి వివరాలను తెలుసుకోవాలని తెలిపారు. ప్రజలు బాధ్యతగా వ్యవహరించి ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గురుదాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జి విట్టల్, సంబంధిత సిబ్బంది జహీర్, అనిల్, పలువురు గ్రామ పెద్దలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## తునికి నల్లపోచమ్మ ఆలయ హుండీ లెక్కింపు...

### ఐదు నెలల 12 రోజులకు గాను హుండీ లెక్కింపు ఆదాయం రూ 8.63 వేల 871 రూపాయలు



**కౌడిపల్లి, సెప్టెంబర్ 08 (జనంసాక్షి):** కౌడిపల్లి మండలం తునికి గ్రామంలో వెలిసిన ప్రసిద్ధ శ్రీ నల్లపోచమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. ఆలయ ప్రాంగణంలో ఆలయ ఈఓ రంగారావు, శ్రీ లలిత సేవా ట్రస్ట్ సూరారం వారి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపును నిర్వహించారు.

ఏప్రిల్ నెల నుంచి సెప్టెంబర్ మొదటి వారం వరకు ఐదు నెలల 12 రోజులకు గాను భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను లెక్కించారు. ఈ లెక్కింపులో నగదు రూపంలో మొత్తం రూ.8,63,871 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ రంగారావు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాన్ని సందర్శించి మొక్కులు చెల్లించడంతో హుండీ ఆదాయం గణనీయంగా వచ్చినట్లు పేర్కొన్నారు. హుండీ లెక్కింపు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు, ఆలయ సిబ్బంది, ట్రస్ట్ సభ్యులు సమన్వయంతో వ్యవహరించారు. ఎలాంటి అవకతవకలు, అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసుల పర్యవేక్షణలో హుండీని తెరిచి ఆదాయాన్ని లెక్కించినట్లు ఈఓ తెలిపారు. లెక్కించిన మొత్తాన్ని ఆలయ ఖాతాలో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు.

శ్రీ నల్లపోచమ్మ ఆలయానికి ప్రతి సంవత్సరం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లిస్తుంటారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు హుండీ ద్వారా సమకూరే ఆదాయాన్ని వినియోగించేందుకు చర్యలు తీసుకుంటామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిపేట డివిజన్ ఇన్‌స్పెక్టర్ పట్లోళ్ల విజయలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ వెంకటరెడ్డి, ప్రధాన అర్చకులు శివప్ప, అర్చకులు రాజేష్, విఘ్నేష్, గ్రామ సర్పంచ్ ధనలక్ష్మి శేఖర్, శ్రీ లలిత సేవా ట్రస్ట్ సభ్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల హక్కుల కోసం ఉద్యమించిన వీరనారి చాకలి ఐలమ్మ



• కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 08(జనంసాక్షి):** అణగారిన వర్గాల హక్కుల కోసం ఉద్యమించిన వీర నారి చాకలి ఐలమ్మ అని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు.వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని ఈ నెల 10వ తేదీన ఉదయం 10:30 గంటలకు సంగారెడ్డి కలెక్టరేట్ సమీపంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు.చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ పోరాటంలో ధైర్యసాహసాలతో పోరాడి, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఉద్యమించిన గొప్ప వీరనారి అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొని చాకలి ఐలమ్మకు ఘన నివాళులు అర్పించాలని కలెక్టర్ కోరారు.

## శాంతియుతంగా గణేష్ ఉత్సవాలను జరుపుకోవాలి

• వేడుకల బాధ్యత పూర్తిగా నిర్వాహకులదే



**న్యాల్‌కల్, సెప్టెంబర్ 08, (జనంసాక్షి):** ఈ నెల12 నుండి కొనసాగె వినాయక నవరాత్రి ఉత్సవ వేడుకలను సామరస్యం గా, శాంతియుతంగా, ఇతర మతస్తులకు ఎలాంటి విఘాతం కలక్కుండా జరుపు కోవాలని, ఉత్సవ వేడుకల బాధ్యత పూర్తిగా నిర్వాహకుల దేనని జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు, ఎస్సై సుజిత్‌లు గణేష్ ఉత్సవ నిర్వా హకులకు సూచనలు ఇచ్చారు. మంగళవారం జహీరాబాద్ డిఎస్పి సైదా నాయక్ ఆదేశం మేరకు మండలంలోని హద్నూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వాహకులకు అవగాహన కల్పించారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశం మేరకు నిర్వాహకులు తూచా తప్పకుండా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గణేష్ ఉత్సవ నిర్వాహక భక్తులు, యువకులు పాల్గొన్నారు.

## మహిళా ప్రజాప్రతినిధుల కోసం గులాబీ దండు గర్జన

• జోగిపేటలో బీఆర్ఎస్ మహిళల నిరసన ర్యాలీ



**సంగారెడ్డి, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధులపై పోలీసుల దాడులు, వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ జోగిపేటలో మహిళా ప్రజాప్రతినిధులు నిరసన ర్యాలీ చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ నాయకత్వం లోని బీఆర్ఎస్ శ్రేణులు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, మహిళా ప్రజాప్రతినిధుల హక్కులను గౌరవించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం కాపాడాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మంతూరి శశికుమార్, బండారి పాండు, గొర్రెగట్టు విట్టల్, వార్డు మెంబర్ కుమ్మరి చంద్రంతో పాటు మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరి

• బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్



**నర్సాపూర్, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తును కాంగ్రెస్ ప్రభుత్వం అంధకారంలోకి నెడుతోందని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ ఆరోపించారు. మంగళవారం నర్సాపూర్‌లోని బీజేపీ అసెంబ్లీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం 'ఛలో అసెంబ్లీ'కి రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌చందర్ రావు పిలుపునిస్తే.. ప్రభుత్వం అక్రమంగా, విచక్షణారహితంగా అరెస్టులు చేయడం దారుణమన్నారు. విద్యార్థుల హక్కుల సాధన కోసం ధర్నాచౌక్‌లో నిర్వహించ తలపెట్టిన 'విద్యార్థి మహాధర్నా'కు సైతం అనుమతి నిరాకరించడం ప్రభుత్వ భయాన్ని తెలియజేస్తోందని విమర్శించారు.

అసెంబ్లీ ముట్టడికి వెళ్లనున్న బీజేవైఎం నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యార్థుల జీవితాలను నాశనం చేయడంతోపాటు, శాంతియుత నిరసనలపై పోలీసుల ద్వారా దౌర్జన్యాలకు పాల్పడుతోందని ఆరోపించారు. రైతుల భూములను ఆక్రమించడం, దేవాలయాల ధ్వంసానికి కారణమవడం వంటి చర్యలను బీజేపీ మెదక్ జిల్లా శాఖ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ప్రభుత్వానికి పాలన చేతకాకపోతే వెంటనే రాజీనామా చేయాలని రాధామల్లేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల కోసం బీజేపీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంగసని సురేష్, మాజీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు రమేష్‌గౌడ్, జిల్లా కార్యదర్శి బిక్షపతి, జిల్లా కోశాధికారి ఆంజనేయులుగౌడ్, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, మండల అధ్యక్షుడు నీలి నగేష్, మోర్చాల నాయకులు నగేష్‌గౌడ్, విఠల్‌నాయక్, నర్సాపూర్ పట్టణ కన్వీనర్ ప్రేమ్, బీజేపీ నాయకులు యాదగిరి, మహేంద్ర, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## శబ్ద కాలుష్యానికి దూరంగా గణేష్ నిమజ్జనం

• డీజేలు, బ్యాండ్ మేళాలకు కంగ్టి ఉత్సవ కమిటీల స్వస్తి



**కంగ్టి, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** వినాయక ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కంగ్టి మండలంలోని 12 గణేష్ ఉత్సవ కమిటీలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఆగమనం నుంచి నిమజ్జనం వరకు డీజేలు, బ్యాండ్ మేళాలు, అధిక శబ్దాలకు దూరంగా ఉండాలని ఏకగ్రీవంగా తీర్మానించాయి. తీర్మానం ప్రతిని ఎస్ఐ దుర్గారెడ్డికి అందజేశారు. కమిటీల నిర్ణయాన్ని ఎస్ఐ అభినందిస్తూ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఎప్పుడూ దొరల పార్టీనే

• గ్రామాల నుంచి ఆ పార్టీ నేతలను తరిమికొట్టాలి: మంజే మల్లేశం



**చేర్యాల, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి దళితులు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలకు అన్యాయం చేస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంజే మల్లేశం ఆరోపించారు. బీఆర్ఎస్ సామాన్యుల పార్టీ కాదని, దొరల పార్టీగానే కొనసాగుతోందని విమర్శించారు. తెలంగాణ ప్రజలు దొరల అహంకారాన్ని సహించకే కాంగ్రెస్‌కు అధికారం అప్పగించారని అన్నారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ నేతల అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. దళితుడిని సీఎం చేస్తానని కేసీఆర్ హామీ ఇచ్చి మోసం చేశారని ఆరోపించారు. అసెంబ్లీ ముట్టడి సందర్భంగా బీఆర్ఎస్ నేతలు పోలీసులతో దురుసుగా వ్యవహరించారని విమర్శించారు. స్పీకర్‌పై వ్యాఖ్యలు చేసిన తాతా మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ కుట్రలకు ప్రజలే తగిన సమాధానం చెబుతారని, దళిత నాయకులు ఆ పార్టీని వీడాలని పిలుపునిచ్చారు.

## 6 గ్యారెంటీలు... 420 హామీలు అమలు చేయాలిని బిఆర్ఎస్

### పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతి



**అమరచింత, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** మంగళవారం పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ 1000 రోజులు అవుతున్న ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలక్షేపం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి. బిఆర్ఎస్ నాయకులు పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమల వేసి.అనంతరం వారు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించినారు బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు మాజీ ఎంపీపీలు ఎంపీటీసీలు సర్పంచులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ చావును కోరుకుంటారా?

• షాద్‌నగర్ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఫిర్యాదు

• ఎమ్మెల్యే కే. శంకరయ్యపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

• పైతర గ్రామ సర్పంచ్ యాబన్నగారి రవితేజ రెడ్డి ఆధ్వర్యంలో





**కొల్చారం, సెప్టెంబరు 8(జనంసాక్షి):** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరణాన్ని కోరుతూ షాద్‌నగర్ ఎమ్మెల్యే కే. శంకరయ్య బహిరంగంగా వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు మంగళవారం కొల్చారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొల్చారం మండలం పైతర సర్పంచ్ రవితేజరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు పోలీసులను కలిసి ఫిర్యాదు అందజేశారు.

కేసీఆర్‌కు హాని చేకూరే విధంగా ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేశారని, వాటిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను కోరారు. ఓ టీవీ ఛానల్‌లో కేసీఆర్ రాష్ట్రానికి పట్టిన పీడ అని, ఆయన చావును కోరుకుంటున్నామని, వెయ్యి డప్పులతో ర్యాలీ నిర్వహిస్తామని ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేసినట్లు బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు.

బాధ్యతాయుతమైన ఎమ్మెల్యే పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే కే. శంకరయ్యతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆర్ల సుధాకర్, బాచారం యాదగిరి, కంటే పోచయ్య, ఎర్ర పెంటయ్య, కుమ్మరి నాగరాజు, కుమ్మరి పెంటయ్య, గంగాల నర్సింలు, విజయ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## లింగోజిరావు ఆశయాలను కొనసాగిస్తాం



**తెలకపల్లి, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు కామ్రేడ్ లింగోజిరావు ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తామని సీపీఎం జిల్లా నాయకులు గోపాస్ లక్ష్మణ్, నాగపూర్ మధు అన్నారు. మంగళవారం గడ్డంపల్లి గ్రామంలో లింగోజిరావు 13వ వర్ధంతి సందర్భంగా ఆయన స్థూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు, లింగోజిరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వినాయక మండపాలకు ముందస్తు అనుమతులు తీసుకోవాలి

• డీజేలకు అనుమతి లేదు: సీఐ శివకుమార్



**అమరచింత, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** వినాయక చవితి సందర్భంగా మండపాల ఏర్పాటుపై సీఐ టీ. శివకుమార్ ఆధ్వర్యంలో శాంతిభద్రతలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండపాల నిర్వాహకులు ముందస్తుగా అనుమతులు తీసుకోవాలని, మండపం, విద్యుత్ కనెక్షన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యుత్ భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలన్నారు. డీజేలకు అనుమతి లేదని, రాత్రి 10 గంటల వరకు మాత్రమే భక్తి గీతాలు వినిపించాలని, అనంతరం ఎలాంటి శబ్దం చేయరాదని స్పష్టం చేశారు. ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించి పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, సర్పంచులు, వార్డు సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# మహిళ ఆరోగ్యమే సమాజ ఆరోగ్యానికి పునాది

- ప్రతి మంగళవారం 'ఆరోగ్య మహిళ' కార్యక్రమం: డాక్టర్ ప్రియాంక



బిజినేపల్లి, సెప్టెంబర్ 8 (జనం సాక్షి): మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం ఆరోగ్యంగా ఉంటాయని పాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.ప్రియాంక అన్నారు. తెలంగాణ ప్రభుత్వం మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం నిర్వహిస్తున్న 'ఆరోగ్య మహిళ' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రతి మంగళవారం మహిళల కోసం ప్రత్యేకంగా ఆరోగ్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంతానోత్పత్తి, లైంగిక ఆరోగ్య సమస్యలు, హృదయ సంబంధ వ్యాధులు, క్యాన్సర్, మధుమేహం, అధిక రక్తపోటు, నెలసరి సమస్యలు, మానసిక ఆరోగ్యం, ఆస్టియోపోరోసిస్ తదితర సమస్యలకు పరీక్షలు, వైద్య సలహాలు అందిస్తున్నట్లు చెప్పారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని ఉన్నత ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నామని తెలిపారు.

మహిళలు శారీరకంగా, మానసికంగా, సామాజికంగా ఆరోగ్యంగా ఉండటమే సంపూర్ణ ఆరోగ్యమని పేర్కొన్నారు. ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, తృణ ధాన్యాలు, తగినంత నీరు తీసుకోవడంతో పాటు ప్రతిరోజూ వ్యాయామం లేదా



శారీరక శ్రమ చేయాలని అన్నారు. రోజుకు ఏడు నుంచి ఎనిమిది గంటలు ప్రశాంతమైన నిద్ర అవసరమని, ఒత్తిడిని తగ్గించుకుని సానుకూల దృక్పథంతో ఉండాలని సూచించారు. ఇంటి పనుల్లో నిమగ్నమై మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ప్రతి మంగళవారం జరిగే ఆరోగ్య మహిళ కార్యక్రమానికి 50 నుంచి 100 మంది వరకు వివిధ సమస్యలతో వస్తున్నారని తెలిపారు. వారికి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ అవసరమైన పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. తెలంగాణ టీ-హబ్ ద్వారా రక్తం, మూత్రం తదితర పరీక్షలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డాక్టర్ ప్రియాంక పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

## కత్తితో దాడి చేసిన ఇద్దరు నిందితుల అరెస్ట్




**జహీరాబాద్,సెప్టెంబర్ 8(జనంసాక్షి):** ఆదివారం నాడు కత్తితో పొడిచి పారిపోయిన నిందితులను పట్టుకున్నట్టు రూరల్ ఎస్ ఐ రాజేందర్ చిరాగ్ పల్లి ఎస్ ఐ వినయ్ కుమార్ లు తెలిపారు. జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దిడ్గి గ్రామ శివారులో ఆదివారం రాత్రి జరిగిన దాడి ఘటనకు సంబంధించిన నిందితులు దిడిగి గ్రామానికి చెందిన సయ్యద్ అస్లాం (33), జుబేర్‌లను అరెస్ట్ చేసి డిఎస్పి సైదా నాయక్ సమక్షంలో రిమాండుకు పంపినట్లు అయన తెలిపారు.వీరిద్దరూ ఆదివారం నాడు నీరటి రాజుతో గొడవపడి అతనిపై దాడి చేశారని అనంతరం అక్కడికి వచ్చిన నీరటి ప్రశాంత్, నీరటి యశ్వంత్‌లను కూడా బెదిరించి, అస్లాం కత్తితో దాడి చేయగా, జుబేర్ ఇనుప రాడ్‌తో దాడి చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. నిందితులు నేరానికి ఉపయోగించిన కత్తి,ఇనుప రాడ్ తో పాటు, ద్విచక్ర వాహనం, రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులను 07.09.2026 సాయంత్రం జహీరాబాద్ NH-65 సమీపంలోని మెహఫిల్ హోటల్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఈ ఘటనపై క్రైమ్ నంబర్ 102/2026గా కేసు నమోదు చేసి, BNS 109, 115(1), 351(3), 3(5) మరియు SC/ST (POA) Act, 2015లోని సెక్షన్ 3(1)(r)(s) కింద దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

## మూడవరోజు జర్నలిస్టుల రిలే దీక్ష



**నిజాంపేట, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** 1952 నుండి 2009 వరకు కొనసాగిన రామాయంపేట నియోజకవర్గన్నీ మళ్లీ ఏర్పాటు చేయాలని నిజాంపేట మండల జర్నలిస్టులు చేపట్టిన రిలే దీక్ష మంగళవారం నాటికి మూడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మండల విలేకరులు మాట్లాడుతూ.. రామాయంపేట నియోజకవర్గం ఏర్పాటు చేసినట్లయితే నిజాంపేట, రామాయంపేట తో పాటు వివిధ మండలాలు సైతం అభివృద్ధి దిశగా కొనసాగుతాయన్నారు. వెంటనే రామాయంపేట నియోజకవర్గం కొనసాగించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. జర్నలిస్టులు చంద్రం,సంజీవ్, బాలరాజు, సిద్దరాములు, శ్రీరాములు, స్వామి తదితరులు ఉన్నారు.

## పారిశుధ్యంపై దృష్టి సారించిన పంచాయతీ అధికారులు



**న్యాల్‌కల్, సెప్టెంబర్ 08, (జనంసాక్షి):** న్యాల్‌కల్‌లోని వివిధ వార్డులు, జనసంచార ప్రదేశాల కాలువల్లో పేరుకుపోయిన మురుగు, చెత్త, చదారాన్ని తొలగించేందుకు స్థానిక గ్రామ పంచాయతీ అధికారులు దృష్టి సారించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు ప్రవీణ్ కుమార్, తదితరుల పర్యవేక్షణలో గ్రామంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ, ఎస్సీ కాలనీ, తదితర జనసంచార ప్రదేశాల సమీపానగల మురుగు కాలువల్లో పేరుకు పోయిన మురుగు, చెత్త, చదారాన్ని జెసిబితో మెరుగు పరిచారు. కాలువల్లో పేరుకు పోయిన మరుగు ప్రదేశం ఈగలు, దోమలు, శునకాలు, వరాహాలు, తదితర జీవాలకు నివాసాలుగా మారాయి. దుర్గంధం, దుర్వాసన నెలకొనడంతో అటువైపుగా రాక, పోకలు సాగించే జనాలు నిత్యం అవస్థలకు గురయ్యావారు. ఎట్టకేలకు గ్రామంలోని పలు కాలనీల్లో పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శి, కార్మికులు దృష్టి సారించడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## టీఎంజేఎఫ్ రాష్ట్ర మహాసభల కరపత్రాల ఆవిష్కరణ




**కోహీర్, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** హైదరాబాద్‌లో ఈ నెల 12న జరగనున్న తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం (టీఎంజేఎఫ్) 3వ రాష్ట్ర మహాసభల ప్రచార కరపత్రాలను జహీరాబాద్ సీఐ రవి కుమార్, ఎస్ఐ నరేష్ మంగళవారం కోహీర్ పోలీస్‌స్టేషన్‌లో ఆవిష్కరించారు. రాష్ట్ర నాయకులు చెల్మెడ అనిల్‌కుమార్, ఎం. సుధాకర్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. జర్నలిస్టుల హక్కులు, సామాజిక సమానత్వం, అణగారిన వర్గాలకు మీడియాలో ప్రాతినిధ్యం లక్ష్యంగా టీఎంజేఎఫ్ పనిచేస్తోందని నాయకులు తెలిపారు. మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## పేదలకు సొంతింటి కల సాకారం

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేసిన మున్సిపల్ చైర్మన్



**పెబ్బేరు, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** పెబ్బేరు మున్సిపాలిటీలోని 12వ వార్డులో కుమ్మరి సరస్వతి, రాములు దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం భూమిపూజ నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేసి, లబ్ధిదారులకు మంజూరు ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు.

**ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ..** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తోందన్నారు. నియోజకవర్గంలోని అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇల్లు మంజూరు కావడం పై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే మేఘా రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, విజయవర్ధన్‌రెడ్డి, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## డీజే, బ్యాండ్ లేకుండా వినాయక ఉత్సవాలు



**కంగ్టి, సెప్టెంబర్ 8(జనంసాక్షి):** వినాయక నిమజ్జనం, ఆగమన్ ఊరేగింపుల్లో డీజే బాక్సులు, బ్యాండ్‌లు, టపాకాయలు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఆధ్యాత్మికంగా నిర్వహించాలని కంగ్టి వినాయక ఉత్సవ నిర్వాహకులు ఏకగ్రీవంగా తీర్మానించారు. డీజే, బ్యాండ్‌ల వల్ల అధిక ఖర్చు, శబ్ద, వాయు కాలుష్యం ఏర్పడుతోందని, యువత మద్యం సేవించే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఊరేగింపులను భజనలు, కీర్తనలతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తామని పేర్కొన్నారు. తీర్మాన పత్రాన్ని ఎస్సై దుర్గారెడ్డికి అందజేయగా ఆయన నిర్వాహకులను అభినందించారు.

## బహుజన అధికారానికి అడుగులు

- ఏడుపాయలకు టీఆర్పీ నాయకుల పాదయాత్ర




**మనోహరాబాద్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):** మనోహరాబాద్ నుంచి మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గ భవాని ఆలయానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) నాయకులు, కార్యకర్తలు పాదయాత్ర చేపట్టారు. బీసీ వర్గాల హక్కుల సాధన, ప్రజల సమస్యల పరిష్కారం, పార్టీ బలోపేతమే లక్ష్యమని తెలిపారు. బహుజన అధికార సాధనకు కృషి చేస్తామని, సామాజిక పోరాటంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**ప్రజా సమస్యలపై పోరాటం...**

ప్రజలకు, కార్యకర్తలకు అండగా ఉంటూ సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందిస్తామని నాయకులు పేర్కొన్నారు. పాదయాత్రలో నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## అఖిలభారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ, మహాసభలు



**అమరచింత, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** మంగళవారం నాడు యాదగిరిగుట్టలో అట్టహాసంగా జరగబోయే మహాసభలకు.. వనపర్తి జిల్లా ఎఐవైఎఫ్ ప్రతినిధులు బయలుదేరారు.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎత్తం మహేష్, ఎండి కుతుబ్ లు మాట్లాడుతూ ఏఐవైఎఫ్ మూడవ రాష్ట్ర మహాసభలు యాదగిరిగుట్టలో ఈరోజు మధ్యాహ్నం రెండు గంటలకు భారీ బహిరంగ సభ ఉంటుందని, 9, 10 తేదీల్లో ప్రతినిధుల మహాసభ ఉంటుందని ఈ రెండు రోజుల కార్యక్రమంలో ఈ రాష్ట్రంలో గత కార్యక్రమాలను సమీక్షిస్తూ భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకుంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎత్తం విష్ణు, కదిరే అశోక్, కటారి పరమేష్, ఎండి మహిబూబ్, ఎండి ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

## అగస్టిన్ ఆదర్శప్రాయుడు డాక్టర్.ప్రేమ్ కుమార్



**గద్వాల నడిగడ్డ సెప్టెంబర్ 8(జనంసాక్షి);** ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్ పొందిన తప్పెట్ల మోర్స్ హై స్కూల్ టీచర్ అగస్టిన్ ఆదర్శప్రాయుడు అని సామాజిక విప్లవ కారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ అన్నారు. అంతే కాక కొద్ది మంది టీచర్ లు మాత్రమే ఎంపిక అయ్యే ఫిన్ల్యాండ్ పర్యటనకు టీచర్ అగస్టిన్ ఎన్నిక కావడం గర్వించదగ్గ విషయం అని ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికైన సందర్భంగా సామాజిక విప్లవ కారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ టీచర్ అగస్టిన్ ను ఘనంగా సన్మానించారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం




వెల్దండ, సెప్టెంబర్ 8 (జనంసాక్షి): అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని సర్పంచ్ మట్ట యాదమ్మ, మట్ట వెంకటయ్యగౌడ్ అన్నారు. వెల్దండ రైతువేదికలో తహసీల్దార్ కార్తీక్‌కుమార్‌తో కలిసి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు లబ్దిదారులకు కార్డులు అందజేశారు. రేషన్ కార్డులు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి మోతిలాల్ నాయక్, సర్పంచుల సంఘం అధ్యక్షురాలు భాగ్యమ్మ, ఉపసర్పంచ్ ఎర్ర శీను, కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు పాల్గొన్నారు.

## దళిత స్పీకర్ ను అవమానించిన తాత మధు పై చర్యలు తీసుకోవాలి పుల్లయ్య



వెల్దండ, సెప్టెంబర్ 08 (జనంసాక్షి): దళిత స్పీకర్ ను అవమానించిన బిఆర్ఎస్ నేత తాత మధు తీరుపై రాష్ట్రవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వెల్దండ మండలంలో కాంగ్రెస్ సీనియర్ నేత కొయ్యల పుల్లయ్య విలేకరుల సమావేశం నిర్వహించారు. దళిత స్పీకర్ ను అవమానించడం దారుణమని, ఇది బీఆర్ఎస్ దళిత వ్యతిరేక వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. తాత మధు పార్టీ సభ్యత్వాన్ని రద్దు చేసి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని, జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

## మిట్టపై మృత్యు వేగం.. బైక్‌ను ఢీకొట్టిన కారు!

- ఇద్దరు యువతకు తీవ్ర గాయాలు..
- మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రులకు తరలింపు

గోపాల్‌పేట, సెప్టెంబర్ 8 (జనంసాక్షి): వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం ఏదుట్ల గ్రామం సమీపంలో ఆదివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్‌పై వనపర్తికి వెళ్తున్న ఏదుల గ్రామానికి చెందిన కుండెళ్ల నరేందర్ (21), సవైగూడెంకు చెందిన నక్క భవాని (18)ను ఎదురుగా వేగంగా వచ్చిన కారు (TS06EV2782) మిట్ట వద్ద ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. నరేందర్ కుడికాలి బొటనవేలు తెగిపోగా, భవాని కుడి మోకాలికి తీవ్ర గాయమైంది. క్షతగాత్రులను వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం నరేందర్‌ను మహబూబ్‌నగర్ ఎస్‌వీఎస్ ఆసుపత్రికి, భవానిని హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను ఓంకార్‌గా గుర్తించారు. నరేందర్ బంధువు శేషయ్య ఫిర్యాదుతో గోపాల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఆశావర్కర్ల అరెస్టులను ఖండించిన సీఐటీయూ

అమరచింత, సెప్టెంబర్ 8 (జనంసాక్షి): సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాకు బయలుదేరిన ఆశా కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం సిగ్గుచేటని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రాజు ఖండించారు. ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆరు నెలల పీఆర్సీ బకాయిలు, సర్వేలు, పల్స్‌పోలియో, ఎన్నికల విధుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. ఎన్‌సీడీ ఆన్‌లైన్, ఏఎంసీ, పీఎంసీ తదితర టార్గెట్లు రద్దు చేయాలని, సెలవులు, మెడికల్ లీవ్ సౌకర్యాలు కల్పించాలని, ఏఎన్ఎం, జీఎన్ఎం పోస్టుల్లో ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శాంతమ్మ, నిర్మల, శ్రీదేవి, మాధవి, స్వరూప, ఈశ్వరమ్మ, కవిత, సర్వమ్మ, యశోద, మహేశ్వరి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రెషర్స్‌కు ఆత్మీయ స్వాగతం

- విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు.. అధ్యాపకులకు ఘన సన్మానం



మహమ్మదాబాద్, సెప్టెంబర్ 8 (జనంసాక్షి): మహమ్మదాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ పార్టీని విద్యార్థులు ఉత్సాహంగా నిర్వహించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలికారు. నూతన విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, స్నేహభావం, సృజనాత్మకత పెంపొందించేలా కార్యక్రమం సాగింది. షష్ఠాబ్ది స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యాపకులను ఘనంగా సన్మానించి, విద్యార్థుల అభివృద్ధికి వారు చేస్తున్న కృషిని కొనియాడారు. అనంతరం విద్యార్థులు పాటలు, నృత్యాలు, ఇతర సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. విద్యతోపాటు కళ, సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పలువురు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భీమ్‌రెడ్డి, సర్పంచ్ రాంలాల్, ఉప సర్పంచ్ పవన్‌కుమార్, విజయానంద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా హక్కుల కోసం బీఆర్ఎస్ వినతి

- 6 హామీలను వెంటనే అమలు చేయాలి: గోలి శ్రీనివాస్‌రెడ్డి



వెల్దండ, సెప్టెంబర్ 8 (జనంసాక్షి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. వెల్దండ మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మండల అధ్యక్షుడు పుట్ట రాంరెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ఆహార కమిషన్ అధ్యక్షుడు గోలి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023 ఎన్నికల్లో ఇచ్చిన ఆరు హామీలు 18 నెలలు గడిచినా అమలు కాలేదని విమర్శించారు. హామీలను వెంటనే అమలు చేయకపోతే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ విజితారెడ్డి, అనిల్‌కుమార్, జోగయ్య, నిరంజన్, లింగం, శేఖర్, నాగులునాయక్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

### రాగా ఫర్ రైజ్ ఆఫ్ ఇండియా

## పాదయాత్రకు ఘన స్వాగతం

- జడ్చర్లలో కాంగ్రెస్ నాయకుల సంఘీభావం



జడ్చర్ల, సెప్టెంబర్ 8 (జనంసాక్షి): రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర స్ఫూర్తితో దేశంలో బీజేపీ పాలనకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావడం, రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలనే లక్ష్యంతో ఏపీ హైకోర్టు న్యాయవాది కాటూరి వెంకటేశ్వర్లు చేపట్టిన 'రాగా ఫర్ రైజ్ ఆఫ్ ఇండియా' జాతీయ పాదయాత్ర మంగళవారం జడ్చర్లకు చేరుకుంది. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు కొనసాగుతున్న యాత్రకు స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి పాల్గొన్నారు. రాహుల్‌గాంధీ నాయకత్వంలో దేశంలో మార్పు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వంశీకృష్ణ చారి, జిల్లా ఉపాధ్యక్షుడు మీనాజోద్దీన్, రాజేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు గోపాల్, మాజీ ఎంపీపీ నిత్యానందం, మాజీ సర్పంచ్ వెంకటేశం, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్పీకర్ గౌరవాన్ని కించపరిస్తే సహించం...

- స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ శ్రేణుల నిరసన



మహమ్మదాబాద్, సెప్టెంబర్ 8 (జనంసాక్షి): తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం మహమ్మదాబాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో భారీ నిరసన చేపట్టారు. పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేఎం నారాయణ మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న అసెంబ్లీ స్పీకర్‌పై వ్యక్తిగతంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. స్పీకర్ పదవి పట్ల ప్రతి ఒక్కరూ గౌరవం, సంయమనం పాటించాలని సూచించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు హుందాగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి గండీడ్ మండలం పీఏసీఎస్ చైర్మన్ కమతం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శాంతి రంగ్యా, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు జే.రాంలాల్, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

- ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలి: ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షుడు దేశం సైదులు




కల్వకుర్తి,సెప్టెంబరు 8,(జనంసాక్షి): ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆటో డ్రైవర్స్ యూనియన్ కల్వకుర్తి పట్టణ అధ్యక్షుడు దేశం సైదులు డిమాండ్ చేశారు.కల్వకుర్తి పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఆటో డ్రైవర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా దేశం సైదులు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఆటో కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఆటో డ్రైవర్ల బాగోగులను ప్రభుత్వం పట్టించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆటో యూనియన్ నాయకులు అమీర్,లక్ష్మీకాంత్‌రెడ్డి,పరశురాం గౌడ్, మహేష్, అంజినాయక్, చిన్న, పురుషోత్తం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రియ వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకోవాలి

- సేంద్రియ పద్ధతులతో ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ: ఏవో మల్లయ్య



ఖిల్లాఘనపూర్, సెప్టెంబర్ 8 (జనంసాక్షి): రైతులు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన పెంచుకుని, సేంద్రియ పద్ధతులను అవలంబించాలని మండల వ్యవసాయ అధికారి మల్లయ్య సూచించారు. మంగళవారం అప్పారెడ్డిపల్లి రైతువేదికలో నిర్వహించిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, రైతులకు అవగాహన కల్పించడం లక్ష్యంగా సేంద్రియ వ్యవసాయ కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి ఉన్న 125 మంది రైతులతో క్లస్టర్ ఏర్పాటు చేసి అవసరమైన కిట్లు అందజేసినట్లు వివరించారు.
సేంద్రియ పద్ధతులతో రైతుల ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు పర్యావరణ పరిరక్షణ, నాణ్యమైన పంటల ఉత్పత్తి సాధ్యమవుతుందని మల్లయ్య తెలిపారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని క్రమంగా తగ్గించి భూసారాన్ని పరిరక్షించే పద్ధతులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మురళీధర్‌రెడ్డి, మూడావత్ రవినాయక్, కొత్తగోళ్ల కృష్ణయ్య, అనమోని కృష్ణయ్య, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

# పోలీసు పెట్రోల్ బంక్‌కు ఏడాది పూర్తి

- ప్రజలకు నాణ్యమైన ఇంధనం, పారదర్శక సేవలే లక్ష్యం: ఎస్పీ సునితారెడ్డి







**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** వనపర్తి–కొత్తకోట ప్రధాన రహదారిపై రాజపేట శివారులో గాయత్రి పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలీసు పెట్రోల్ బంక్ విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా మంగళవారం తొలి వార్షికోత్సవాన్ని జిల్లా ఎస్పీ సునితారెడ్డి, ఐపీఎస్ పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పెట్రోల్, డీజిల్ నాణ్యత, పరిమాణంలో ఎలాంటి రాజీ లేకుండా ప్రజలకు పారదర్శక సేవలు అందించడమే పెట్రోల్ బంక్ లక్ష్యమన్నారు. ఏడాది కాలంగా నిరంతరాయంగా సేవలందిస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందడం సంతోషకరమన్నారు. నాణ్యమైన, కల్తీలేని ఇంధనం వినియోగంతో వాహనాల ఇంజిన్ పనితీరు మెరుగుపడి, మరమ్మతులు, నిర్వహణ ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. పోలీసు పెట్రోల్ బంక్‌లో 24 గంటలూ పెట్రోల్, డీజిల్ అందుబాటులో ఉంటాయని, వాహనదారులు, రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు నేరుగా ఉపయోగపడే సేవల ద్వారా పోలీసు శాఖపై మరింత విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ నాణ్యత, నిజాయితీ, పారదర్శకతతో సేవలు కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బంక్‌లో 24 గంటలూ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఎస్పీ నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, డీఎస్పీలు గిరిబాబు, బాలాజీ నాయక్, సీఐలు రమేష్, శ్రీనివాస్, ఎస్సైలు హృషికేష్, హిమబిందు, ఆర్ఎస్ఐలు వినోద్, మగ్దూం భార్గవ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దాడికి నిరసన

- అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేత



**ఆత్మకూర్, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** అసెంబ్లీ ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపిన బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలపై పోలీసులతో దాడి చేయించడాన్ని నిరసిస్తూ ఆత్మకూర్‌లో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం నిరసన చేపట్టారు. మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. అక్రమ కేసులు, మహిళా ఎమ్మెల్యేలపై దాడులను ఖండించారు. ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మండ్ల రామకృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో 78 మందికి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు

- లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన ప్రజాప్రతినిధులు



**ఆత్మకూర్, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు ఆత్మకూర్ ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 78 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఎం.డి. రహమతుల్లా, మున్సిపల్ చైర్‌పర్సన్ జి.నాగమణి, వైస్ చైర్మన్ నల్లగొండ శ్రీనివాసులు, డీసీసీ కార్యదర్శి తులసిరాజ్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## క్రీడల వల్ల విద్యార్థుల్లో శారీరక దృఢత్వం పెరుగుతుంది

**మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభించిన ఎంపీడీవో**



**పెద్ద శంకరంపేట్, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** క్రీడల వల్ల విద్యార్థుల్లో శారీరక దృఢత్వం పెరుగుతుందని పెద్ద శంకరంపేట ఎంపీడీవో క్రాంతికుమార్ అన్నారు. మంగళవారం పెద్ద శంకరంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఎస్‌జిఎఫ్ క్రీడా పోటీలను క్రీడ జ్యోతి వెలిగించి ఎంపీడీవో క్రాంతి కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలన్నారు. క్రీడల వల్ల విద్యార్థుల్లో క్రమశిక్షణ పట్టుదల. జట్టుగా కలిసి పనిచేసే తత్వం. నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని వివరించారు. క్రీడాకారులను గ్రామీణ స్థాయి నుండి ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ మండల విద్యాధికారి వెంకటేశం. ప్రధానోపాధ్యాయులు రాజప్ప శోభారాణి శశికళ శ్రీలత ఎం ఐ ఎస్ సి సంపత్ రెడ్డి. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్న వాక్యాలపై పోలీసులకు ఫిర్యాదు చేసిన రెడ్డి జాగృతి బృందం



**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ రెడ్డి సామాజిక వర్గంపై చేసిన అనుచిత వాక్యాలను నిరసిస్తూ, మంగళవారం రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ పోలీస్ స్టేషన్లో ఎస్ఐ వెంకటరెడ్డికి ఫిర్యాదు అందజేయడం జరిగింది. చట్టంపై గౌరవంతో పోలీసులను ఆశ్రయించాము రెడ్డి సామాజిక వర్గాన్ని ఉద్దేశించి చేసిన వాక్యాలు అభ్యంతరకరంగా ఉన్నాయని ఈ వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. సమాజంలో ఏ వర్గాన్నీ కించపరిచే విధంగా వాక్యాలు ఎవరు కూడా చేయడం సరికాదని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండకింది మాధవరెడ్డి, జిల్లా అధ్యక్షులు బంక మోహన్ రెడ్డి, మొసలి శ్యాంప్రసాద్ రెడ్డి, నాయకులు, విజయేందర్ రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి, జైపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శేఖర్ రెడ్డి తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిని బర్తరఫ్ చేయాలి

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌ని దూషించడం బాధాకరం
- సిద్దిపేట కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ
- పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్





**సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 08 (జనంసాక్షి):** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మదు నవీన్ కుమార్ రెడ్డి లు చేసిన నీచమైన సంస్కృతి హీనంగా మాట్లాడినందుకు వెంటనే బీఆరెస్ ఎమ్మెల్సీలు తాతా మధును, నవీన్ కుమార్ రెడ్డి లను వెంటనే బర్తరఫ్ చేయాలని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జ్ పూజల హరికృష్ణ అన్నారు. సిద్దిపేటలో రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మదు నవీన్ కుమార్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా ఎస్సీ సెల్ నాయకులు బొమ్మల యాదగిరి ఆధ్వర్యంలో కెసిఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ పార్టీ నాయకులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జ్ పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిని అవమానించేలా మాట్లాడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. రాజకీయంగా విభేదాలు ఉండవచ్చు అని అయితే వ్యక్తిగతంగా కుటుంబ సభ్యులను ఉద్దేశించి పరుష వ్యాఖ్యలు చేయడం సరికాదు అని స్పీకర్ గడ్డం ప్రసాద్ దూషించడం చాలా భాధాకరం అన్నారు. తాతా మధు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు క్షమాపణ చెప్పాలని అన్నారు. ఒక భాధ్యతమైన పదవిలో ఉండి అలా నీచంగా హీనంగా మాట్లాడాటం సిగ్గుచేటని అన్నారు. దళితులు అంటే బీఆరెస్ పార్టీకి నాయకులకు చిన్నచూపు అని ఉద్యమం నుంచి ప్రభుత్వ ఏర్పాటైన తరువాత దళితులను అవమానించి కించపరిచిన దళిత ద్రోహుడు కెసిఆర్ అని అన్నారు. బీఆరెస్ ను ప్రజలు ప్రతిపక్షంలో కూర్చోబెట్టిన సిగ్గురాలేదు అని పామ్హౌస్ లో కూర్చొని కెసిఆర్ చిల్లర రాజకీయాలు చేస్తున్నాడని అన్నారు. అసెంబ్లీ సమావేశాలు జరగకుండా బిఆరెస్ కావాలని అడ్డుకుంటుంది అని అన్నారు. స్పీకర్ ను దూషించిన ఎమ్మెల్సీలు తాతా మధును నవీన్ కుమార్ రెడ్డి లపై కఠిన శిక్ష విధించేలా పోలీసులు కేసు నమోదు చేయాలి అని అన్నారు. పనికిమాలిన నాయకుడు అవినీతిపరుడు కెసిఆర్ కు ప్రజలు తగిన బుద్ధి చెప్తారు అని అధికారం కోసం కెసిఆర్ కెటిఆర్ హరీష్ రావు నీచ రాజకీయాలు చేస్తున్నారు అని మీరు చేస్తున్న డొంగ్రామలు కుట్రలను ప్రజలు గమనిస్తున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో గంప మహేందర్ రావు, బొమ్మల యాదగిరి, ముద్దం లక్ష్మి దాస అంజయ్య, కలిముద్దీన్, రాశాద, గయాజుద్దీన్, విజయ్, దానియల్, వహబ్, సంతోషి, బర్మ రామచంద్ర, రాములు, రాజ్ బహదూర్ రెడ్డి, వంశీ,సనా రజినీ లహరి, దస్తగీర్, దేశెట్టినరేష్, పవన్, చందు, శ్రీనివాస్, కర్ణాకర్, రఘుపతి, అనిల్, నాయకులు పాల్గొన్నారు.

## స్పీకర్‌పై వ్యాఖ్యలకు కాంగ్రెస్ నిరసన

- రాంపూర్ ఎక్స్‌రోడ్ వద్ద తాతా మధుసూదన్ దిష్టిబొమ్మ దహనం



**నంగునూరు, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** అసెంబ్లీ స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ నంగునూరు మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన నిర్వహించారు. రాంపూర్ ఎక్స్‌రోడ్ వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్సీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు రాపోల్ రాజ్ బహదూర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవికి గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. తాతా మధుసూదన్ వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని స్పీకర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరి బోనస్ పొందేందుకు

## రైతులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

- **రేవల్లి మండల వ్యవసాయ విస్తరణ అధికారి మణిచందర్**



**రేవల్లి, సెప్టెంబర్ 08 (జనంసాక్షి):** మండలంలోని రైతులు పండించిన సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం అందిస్తున్న బోనస్ పొందేందుకు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మణిచందర్ తెలిపారు. రైతులు పండించిన సన్న రకం ధాన్యాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడం ద్వారా ప్రభుత్వం అందించే బోనస్‌కు అర్హత పొందవచ్చని తెలిపారు. ఆన్‌లైన్ నమోదు ప్రక్రియకు సెప్టెంబర్ 10వ తేదీ చివరి తేదీ అని పేర్కొన్నారు. అదేవిధంగా, ఫర్టిలైజర్ షాపుల్లో కొనుగోళ్లు చేయకుండా కేవీకే, ఆర్.ఏ.ఆర్.ఎస్ లేదా స్వంతంగా పంట పండించిన రైతులు స్వయంగా ప్రకటించిన లేఖ పత్రాలను సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులకు సమర్పించాలని సూచించారు. సన్న రకం వరి పండించిన రైతులు సెప్టెంబర్ 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

## రాజ్యాంగ పదవికి గౌరవం ఇవ్వాలి

- **రాజకీయ విమర్శలకు హద్దులు ఉండాలి: ఉపసర్పంచ్ నంబు ఇస్తారి**



**కల్వకుర్తి, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను వెంకటాపూర్ ఉపసర్పంచ్ నంబు ఇస్తారి తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధమైన ఉన్నత పదవిలో ఉన్న స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడటం సరికాదన్నారు. రాజకీయ విమర్శలు విధానపరంగా ఉండాలే తప్ప వ్యక్తిగతంగా, సామాజిక వర్గాలను కించపరిచేలా ఉండకూడదన్నారు. దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని పేర్కొన్నారు. తాతా మధు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని స్పీకర్‌కు, దళిత సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయ విభేదాలను వ్యక్తిగత విమర్శలకు దారితీయకుండా హుందాగా వ్యవహరించాలని సూచించారు.

## హామీలు బాకీ.. కాంగ్రెస్ సర్కార్‌కు బాకీ కార్డు!

- **తర్నికల్ తండాలో బీఆర్ఎస్ కార్యక్రమం**



**కల్వకుర్తి, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ కల్వకుర్తి మండలం తర్నికల్ తండాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'బాకీ కార్డు' కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకుడు ఉప్పల వెంకటేష్ పిలుపు మేరకు పార్టీ శ్రేణులు ఇంటింటికీ తిరిగి ప్రజలకు బాకీ కార్డులు పంపిణీ చేశారు. ప్రభుత్వ హామీల అమలుపై వివరిస్తూ ఇళ్లకు స్టిక్కర్లు అంటించారు. అనంతరం డప్పులు, బ్యాండ్ మేళాలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ఉప్పల అఖిల్ పాల్గొని బీఆర్ఎస్ శ్రేణులకు మద్దతు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

- **విద్యార్థులు సైబర్ భద్రత రాయబారులుగా మారాలి: ఎస్పీ సునితారెడ్డి**





**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** విద్యార్థులు చిన్ననాటి నుంచే నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, బాధ్యత, సేవాభావం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని వనపర్తి జిల్లా ఎస్పీ సునితారెడ్డి, ఐపీఎస్ సూచించారు. కొత్తకోట పీపుల్స్ హైస్కూల్‌లో నిర్వహించిన విద్యార్థుల నాయకత్వ పట్టాభిషేక మహోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల పరేడ్‌తో ఎస్పీకి స్వాగతం పలకగా, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల సాంస్కృతిక, పిరమిడ్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.
ఎన్నికైన విద్యార్థులకు ఎస్పీ చేతుల మీదుగా నాయకత్వ బాధ్యతలు అప్పగించి పట్టాభిషేకం నిర్వహించారు. అనంతరం నాయకత్వ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాయకత్వం అంటే కేవలం పదవి, హోదా కాదని, ఇతరులను ముందుకు నడిపించే బాధ్యతతో పాటు సమాజ సేవాభావం కలిగి ఉండటమే నిజమైన నాయకత్వమని అన్నారు. వైఫల్యాలకు నిరుత్సాహపడకుండా వాటి నుంచి పాఠాలు నేర్చుకుని లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కోరారు. అనుమానాస్పద లింకులు, తెలియని యాప్‌లు, ఆన్‌లైన్ పెట్టుబడి ఆఫర్లు, నకిలీ ప్రకటనలను నమ్మవద్దన్నారు. ఓటీపీ, ఏటీఎం, బ్యాంకు వివరాలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని స్పష్టం చేశారు. తాము నేర్చుకున్న విషయాలను కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలకు తెలియజేసి సైబర్ భద్రత రాయబారులుగా మారాలని పిలుపునిచ్చారు.
బాలల భద్రతపై అవగాహన కలిగి ఉండాలని, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, ఫోక్సో చట్టంపై ప్రాథమిక అవగాహన అవసరమని తెలిపారు. బాలల రక్షణ కుటుంబం, పాఠశాల, సమాజం సమష్టి బాధ్యత అన్నారు. ప్రిన్సిపల్ కృష్ణవేణి, చైర్మన్ ఎద్దుల రాజవర్ధన్‌రెడ్డి, డైరెక్టర్ చంద్రహాస్ ఎస్పీని సన్మానించారు. కార్యక్రమంలో కొత్తకోట సీఐ ఓ.డి. రమేష్, ఎస్సై విక్రమ్, శ్రీరంగాపూర్ ఎస్సై హిమబిందు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల హక్కుల కోసం ఉద్యమబాట

- **10న హైదరాబాద్‌లో జేఏసీ మహాధర్నా.. భారీగా తరలిరావాలని పిలుపు**



**మద్దూరు, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఉద్యమానికి సిద్ధమైంది. జేఏసీ పిలుపు మేరకు ఈ నెల 10న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్లు ఉద్యోగ సంఘాల నాయకులు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయడంతో పాటు పీఆర్సీని అమలు చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. జేఏసీ పిలుపు మేరకు వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు తరలివచ్చి మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల ఐక్యతను చాటేలా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి

**ప్రశాంతంగా ఉత్సవాలు నిర్వహించాలి: ఎస్సై షంషుద్దీన్**



**బిజినేపల్లి, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** గణేష్ మండపాల ఏర్పాటుకు సంబంధిత అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్సై షంషుద్దీన్ సూచించారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో సర్పంచులు, ప్రజలు, మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండపాల ఏర్పాటులో భద్రతా ప్రమాణాలు, శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన కల్పించారు. మండపాల వల్ల ప్రజల రాకపోకలు, అత్యవసర వాహనాలకు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. విద్యుత్ వైరింగ్‌లో జాగ్రత్తలు పాటించాలని, లౌడ్‌స్పీకర్లు, డీజేలను నిబంధనలు, సమయ పరిమితులకు అనుగుణంగా వినియోగించాలని సూచించారు. వివాదాస్పద, చట్టవిరుద్ధ కార్యక్రమాలకు తావివ్వకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. సమావేశంలో పోలీసు సిబ్బంది, సర్పంచులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

# గ్రహణం పట్టిన మర్రిపల్లి గ్రామపంచాయతీ

- **వరుస బదిలీలతో కార్యదర్శుల మార్పులు.. కొంతకాలం పాలనకు అంతరాయం**



**ఉప్పునుంతల, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** మండల పరిధిలోని మర్రిపల్లి గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శుల వరుస మార్పులతో కొంతకాలం పరిపాలనలో అంతరాయం ఏర్పడింది. కార్యదర్శుల బదిలీలు, డెప్యుటేషన్లు, ఇన్‌చార్జ్‌ల మార్పుల కారణంగా పంచాయతీ సేవలు పొందేందుకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**వరుస మార్పులతో ఇబ్బందులు...**

మర్రిపల్లి గ్రామపంచాయతీలో రెగ్యులర్ కార్యదర్శిగా పనిచేసిన లక్ష్మణ్ జూన్ రెండో వారంలో బదిలీపై వెళ్లారు. అనంతరం హారిక జూన్ మూడో వారంలో బాధ్యతలు స్వీకరించి వారం, పది రోజుల పాటు విధులు నిర్వహించారు. ఆ తర్వాత ఎం.కిషన్ బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టగా, నెల రోజులు పూర్తికాకముందే ఒంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామానికి డెప్యుటేషన్‌పై వెళ్లినట్లు సమాచారం.దీంతో ఉప్పునుంతల మండలం ఉప్పురపల్లికి చెందిన ప్రదీప్‌ను ఇన్‌చార్జ్ కార్యదర్శిగా నియమించారు. ఆయన కూడా కొద్దిరోజులకే మారడంతో మళ్లీ కార్యదర్శి సమస్య ఏర్పడింది. ప్రస్తుతం హారిక తిరిగి విధుల్లో చేరడంతో పంచాయతీ సేవలు అందుబాటులోకి రానున్నట్లు అధికారులు తెలిపారు.

**సేవలు అందుబాటులోకి: ఎంపీఓ చంద్రశేఖర్**

కార్యదర్శుల మార్పుల కారణంగా కొంతకాలం పంచాయతీ పరిపాలనలో అంతరాయం ఏర్పడినప్పటికీ, హారిక తిరిగి విధుల్లో చేరడంతో ప్రజలకు అవసరమైన పంచాయతీ సేవలు అందుబాటులోకి రానున్నాయని ఎంపీఓ చంద్రశేఖర్ తెలిపారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఇంటి నిర్మాణ అనుమతులు, పన్నుల వసూళ్ల, రికార్డుల నిర్వహణ తదితర పంచాయతీ సేవలు సక్రమంగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

**రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలి: సర్పంచ్**



రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలని సర్పంచ్ సత్తు భూపాల్‌రావు కోరారు. తరచూ కార్యదర్శుల మార్పులు, డెప్యుటేషన్ల కారణంగా పంచాయతీ పరిపాలనలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. ప్రజలకు సేవలు నిరంతరంగా అందాలంటే గ్రామపంచాయతీకి శాశ్వతంగా రెగ్యులర్ కార్యదర్శిని నియమించాల్సిన అవసరం ఉందన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

**ప్రశ్నించే గొంతులను అరెస్టులతో అణచివేస్తారా?**



**ఉప్పునుంతల, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** ఎన్నికల హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తూ, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఉప్పునుంతల మండల బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. ప్రజాప్రతినిధుల ముందస్తు అరెస్టులు ప్రభుత్వ భయాన్ని బయటపెడుతున్నాయని విమర్శించారు. ఆరు గ్యారెంటీలు, ఇతర హామీలపై సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం ప్రతిపక్ష గొంతులను అణచివేస్తోందన్నారు. అరెస్టులతో ప్రజా సమస్యలను పాతిపెట్టలేరని, హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, ఎండీ ఉస్మాన్, మేడమోని శీను, సీహెచ్ సుధాకర్ తదితరులు అరెస్టయ్యారని తెలిపారు.

## గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఉషారాణి బదిలీ



- **నాగర్‌కర్నూల్ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ సుప్రియ**

**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరిం టెండెంట్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ టి.ఉషారాణి గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. 2025 జూలై నుంచి నాగర్‌కర్నూల్ ఆసుపత్రి సేవలను పర్యవేక్షించిన ఆమె, మెరుగైన వైద్య సేవలందించడంలో కీలక పాత్ర పోషించారని వైద్య సిబ్బంది కొనియాడారు. ఆమె స్థానంలో గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ పి.సుప్రియ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ ఉషారాణికి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆమె బదిలీ జిల్లా ప్రజలకు తీరని లోటని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు, ప్రొఫెసర్లు, నర్సింగ్ అధికారులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## పేదలకు వైద్యసేవలు అందించడం అభినందనీయం: మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి



**జడ్చర్ల, సెప్టెంబరు 8 (జనంసాక్షి):** కీర్తిశేషులు చర్లకోల శ్వేత రెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా మంగళవారం జడ్చర్ల మండలం కొడ్గల్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్వేత రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. నిపుణులైన వైద్యుల ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన వందలాది మందికి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ బావులకు త్రి ఫేజ్ కరెంట్ సరఫరా ఇవ్వాలని వినతి పత్రం అందజేత



**కోహెడ, సెప్టెంబర్ 08 (జనంసాక్షి):** వ్యవసాయ బావుల వద్ద త్రిఫేజ్ కరెంట్ సమస్యపై మంగళవారం రోజు తీగలకుంటపల్లి సర్పంచ్ మ్యాకల స్వర్ణలత –సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో తీగలకుంట పల్లి, కోహెడ రైతులు కోహెడ సబ్ స్టేషన్లో ఏఈ రవీందర్ కు వినతి పత్రం అందజేశారు. 3 గంటల త్రిఫేజ్ కరెంట్ ఇస్తేనే పొలాలు పండుతాయాని, లేకుంటే ఎండిపోయే ప్రమాదం ఉందని సర్పంచ్ ఏ ఈ రవీందర్ ను కోరారు. స్పందించిన ఏ ఈ పై అధికారుల దృష్టికి తీసుకెల్లి సమస్యను పరిష్కరిస్తానని చెప్పడం జరిగినదని సర్పంచ్ స్వర్ణ లత, నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో తీగలకుంటపల్లి ఉప సర్పంచ్ రాగులు మహేష్, కోహెడ గ్రామ ఉపసర్పంచ్ కందాల వెంకటేష్, నాయకులు మ్యాకల రజనీకాంత్ రెడ్డి, గుగ్గిళ్ల శ్రీనివాస్, ఖమ్మం రమేష్,పెర్యాల సాగర్ రావు, మూల లక్మారెడ్డి,ఇట్టిరెడ్డి రాజిరెడ్డి,ఇట్టిరెడ్డి బాల్ రెడ్డి,మెతుకు శేఖర్ రెడ్డి,మహేందర్ రెడ్డి,కరడ్ల బాపురెడ్డి, వెంకట్ రెడ్డి, దయ్యాల మహేందర్,ఇట్టి రెడ్డి తిరుపతి రెడ్డి,అజయ్ రెడ్డి,పెరుగు రవీందర్ రెడ్డి, లింగంపల్లి నర్సయ్య,రాగుల రాజు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 1000 రోజుల పాలనలో ప్రజలకు తీవ్ర అన్యాయం

### హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోర వైఫల్యం: చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



**మక్తల్, సెప్టెంబర్ 08 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. ఆరు గ్యారెంటీలను గాలికొదిలేసి సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదమన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, రుణమాఫీ, రూ.500 బోనస్, రైతు కూలీలకు రూ.12 వేల సాయం పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించినా బస్సుల సంఖ్య పెంచకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. విద్యార్థినులకు స్కూటీలు, మహిళలకు రూ.2 వేల సాయం, జాబ్ క్యాలెండర్ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. నారాయణపేట జిల్లాలో ఖాళీగా ఉన్న 133 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసి, విద్యార్థులకు యూనిఫాంలు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని, బూత్పూర్ జలాశయం నీటిని తరలించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రజా వ్యతిరేక విధానాలతో కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని అన్నారు.

# గణేష్ ఉత్సవాల నిర్వహణకు పటిష్ట చర్యలు

- **అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా శాంతియుతంగా నిర్వహించాలి: ఎస్పీ డాక్టర్ వినీత్**



**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** వినాయక చవితి ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టాలని ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశించారు. మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి ఉత్సవాల భద్రత, బందోబస్తుపై పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు.

**ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..** సెప్టెంబర్ 14 నుంచి 25 వరకు గణేష్ ఉత్సవాలు కొనసాగనున్న నేపథ్యంలో ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలన్నారు. మతపెద్దలు, ప్రజాప్రతినిధులు, గణేష్ మండపాల నిర్వాహకులతో శాంతి సమావేశాలు నిర్వహించాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసి ఉత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు.

గణేష్ మండపాల నిర్వాహకులు విగ్రహాల ఏర్పాటు వివరాలను తప్పనిసరిగా పోలీసులకు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగేలా ప్రధాన రహదారులు, రోడ్లపై మండపాలు ఏర్పాటు చేయకుండా చూడాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలకు అనుమతి ఇవ్వకూడదని స్పష్టం చేశారు.

రౌడీషీటర్లు, కమ్యూనల్ షీటర్లను మండలాల వారీగా బైండోవర్ చేయడంతో పాటు సమస్యాత్మక వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. మండపాల వద్ద నిర్వాహకులు తగిన భద్రతా చర్యలు చేపట్టేలా అవగాహన కల్పించాలన్నారు. గణేష్ విగ్రహాలకు జియో ట్యాగింగ్ చేసి, నిమజ్జనం జరిగే మార్గాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విలేజ్ పోలీస్ అధికారులు ప్రతిరోజూ గ్రామాల్లో పర్యటిస్తూ మండ పాల నిర్వాహకులతో మాట్లాడాలని, వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి అవసరమైన సూచనలు అందించాలని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసులు ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని, ఎవరిపట్లా అనుచితంగా ప్రవర్తించరాదన్నారు. సోషల్ మీడియాపై పూర్తిస్థాయి నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ రియాజ్ ఉల్ హక్, డీఎస్పీలు మహేష్, నల్లపు లింగయ్య, సీఐలు, ఆర్ఐ, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## హద్నూర్ కళాశాలకు చెందిన అధ్యాపకురాలికి రాష్ట్రస్థాయి పురస్కారం

- **సీఎం చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్న సదాలక్ష్మి**



**న్యాల్‌కల్, సెప్టెంబర్ 08, (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్ మండలం, హద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఓ అధ్యాపకురాలికి అరుదైన గౌరవం దక్కింది. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా.. సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్ మండలం, హద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన తెలుగు అధ్యాపకురాలు సదాలక్ష్మి.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ నెల 5న కొడంగల్‌లో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి, మంత్రులు, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికైన అధ్యాపకురాలు సదాలక్ష్మికి సీఎం, మంత్రుల చేతుల మీదుగా పురస్కారాన్ని అందించి అభినందించారు. గత 6 సంవత్సరాలుగా స్థానిక ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకురాలుగా విధులను నిర్వహించారు. బదిలీలో భాగంగా పటాన్ చెరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 6 సంవత్సరాల పాటు అధ్యాపకురాలిగా విధులు నిర్వహించారు. అనంతరం తిరిగి మండలంలోని హద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులను కొనసాగిస్తున్నారు. 14 సంవత్సరాల పాటు సుదీర్ఘకాలంగా అధ్యాపకురాలిగా కొనసాగించారు. రచయితగా, వివిధ పత్రికల్లో ప్రత్యేక కథనాలు వ్రాస్తూ సేవలందించడం పట్ల సదాలక్ష్మిని రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకురాలిగా ఎంపిక చేశారు. అధ్యాపకురాలు సదాలక్ష్మి.. సీఎం, మంత్రి, రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారుల చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకోవడం పట్ల కళాశాల ప్రిన్సిపల్ మేరీ, అధ్యాపకుల బృందం, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దాడిని ఖండిస్తున్నాం

### సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి: జంగం శ్రీనివాస్



**పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులపై పోలీసుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్ అన్నారు. పెద్ద శంకరంపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళా ఎమ్మెల్యేలపై దాడి అమానుషమన్నారు. ఘటనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను ప్రశ్నిస్తున్న ప్రజాప్రతినిధులపై దాడులు చేయడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు సమస్యలపై రోడ్డెక్కే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజలకు సీఎం క్షమాపణ చెప్పాలని, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నల్లవాగు రైతులకు నీళ్లు అడిగితే హౌస్ అరెస్టా?

- **కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తుండగా మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి నిర్బంధం**



**కల్హేర్, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** నల్లవాగు ప్రాజెక్టు ఆయకట్టు కింద కృష్ణాపూర్, ఖానాపూర్, ఇంద్రానగర్ గ్రామాల్లో నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో నీటి ప్రవాహం సక్రమంగా లేదన్నారు. రైతుల విజ్ఞప్తి మేరకు మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పంట పొలాలను పరిశీలించారు. అనంతరం సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు బయలుదేరగా పోలీసులు ఆయనను హౌస్ అరెస్ట్ చేసినట్లు తెలిపారు. రైతుల పంటలు ఎండుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని భూపాల్‌రెడ్డి విమర్శించారు. ఇది ప్రజాపాలన కాదు, నిర్బంధ పాలన అన్నారు. కాలువల్లో పూడికతీత పనులు చేపట్టే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## పోచయ్య కుటుంబానికి కల్వకుంట్ల కవిత పరామర్శ

### న్యాయం జరిగే వరకు అండగా ఉంటాం: తెలంగాణ రక్షణ సేన

**మెదక్ టౌన్, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** మెదక్ మండలం పాతూరుకు చెందిన పోచయ్య ఆత్మహత్య ఘటనపై తెలంగాణ రక్షణ సేన పార్టీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. కుటుంబ సభ్యుల ఆరోపణల ప్రకారం అటవీ అధికారులు అదుపులోకి తీసుకుని చిత్రహింసలకు గురిచేయడంతో తీవ్ర మనోవేదనకు గురై పోచయ్య ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత సూచనల మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బట్టి అజయ్ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. కవిత ఫోన్‌లో కుటుంబ సభ్యులతో మాట్లాడి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఘటనపై నిష్పక్షపాత దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయపరమైన సహాయం అందిస్తామని తెలిపారు. నాయకులు కాశాపురం అశోక్, వేపూరి శ్రీనివాస్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయంలో పాము హల్‌చల్

### అర్జీదారులు, సిబ్బంది పరుగులు.. తృటిలో తప్పించుకున్న కార్మికుడు



**మక్తల్, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** మక్తల్ పురపాలక సంఘం కార్యాలయంలో మంగళవారం సుమారు ఐదు అడుగుల జెర్రిపోతు పాము కలకలం సృష్టించింది. కార్యాలయ ఆవరణలోని పొదల నుంచి బయటకు వచ్చిన పాము ప్రధాన ద్వారం గుండా లోపలికి దూసుకెళ్లడంతో అర్జీదారులు, సిబ్బంది భయంతో పరుగులు తీశారు. మున్సిపల్ కార్మికులు పామును నిలువరించే ప్రయత్నం చేయగా, అది ఓ కార్మికుడి కాళ్ల మధ్య నుంచి దూసుకెళ్లడంతో అతడు తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. కార్యాలయ ప్రాంగణంలో పిచ్చిమొక్కలు, పొదలు పెరగడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు.

## సర్టిఫికెట్ల మిస్సింగుపై పిర్యాదు

**బిజినేపల్లి, సెప్టెంబర్08 (జనంసాక్షి):** మండలంలోని మంగనూర్ గ్రామానికి చెందిన స్నేహాంజలి అనే విద్యార్థికి చెందిన సర్టిఫికెట్లు మిస్సింగ్ అయిన్నట్లు మంగళవారం బిజినేపల్లి పోలీస్ స్టేషనులో పిర్యాదు చేసింది. విద్యార్థికి చెందిన స్టడీ సర్టిఫికెట్లు ప్రయాణం చేస్తుండగా తప్పిపోయిన్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఈ విషయమై విచారణ చేసి తప్పి పోయిన సర్టిఫికెట్లను తీసుకువచ్చే ప్రయత్నం చేస్తామని ఎస్సై శంశుద్దీన్ తెలిపారు.

## 11న మక్తల్‌కు

## పుల్లెల గోపీచంద్, ద్రోణాచార్య నాగపురి రమేష్



**మక్తల్, సెప్టెంబర్ 08 (జనంసాక్షి):** మక్తల్ పట్టణంలో ఈ నెల 11న నిర్వహించనున్న మొద టి ఈనాడు అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు భారత బ్యాడ్మింటన్ చీఫ్ నేషనల్ కోచ్ పుల్లెల గోపీచంద్, ప్రము ఖ అథ్లెటిక్స్ ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్ హాజరుకానున్నారు. ఈ మేరకు నిర్వాహకులు వారిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అంద జేశారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయని కోచ్‌లు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మక్తల్ అథ్లెటిక్స్ కోచ్ జగదీశ్, జడ్చర్ల కోచ్ శ్రీనివాస్ పాల్గొని పోటీల ఏర్పాట్లు, వివరాలను వారికి వివరించారు. ఈ క్రీడా సంబరానికి జాతీయస్థాయి ప్రముఖులు వస్తుండటంతో స్థానిక క్రీడాకారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కేసీఆర్ చావు కోరడం దిగజారుడుతనం

- కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ మాజీ మంత్రుల ఫైర్






**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 08 (జనంసాక్షి):** కేసీఆర్ చావు కోరడం కాంగ్రెస్ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనమని బీఆర్ఎస్ మాజీ మంత్రులు విమర్శించారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ నిరసనలకు ప్రజల ఆదరణ చూసి ప్రభుత్వం అణిచివేతకు పాల్పడుతోందని ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణ సాధన, రైతుబంధు, పెన్షన్లు, సాగునీరు, తాగునీరు, వైద్యం, ఉద్యోగాల కోసం చేసిన కృషి ఏమిటని ప్రశ్నించారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ హామీల అమలు కోరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.

## ప్రతి ఒక్కరూ విద్యావంతులుగా ఎదగాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా








**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 08 (జనంసాక్షి):** అక్షరాస్యత తోనే సమాజ ప్రగతి సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ విద్యావంతు లుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో అక్షరాస్యత అవగాహన ర్యాలీని ఘనంగా నిర్వహించారు.

జిల్లా పరిషత్ మైదానం నుంచి ప్రారంభమైన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. జెడ్పీ మైదానం నుంచి మల్లికార్జున్ ఎంటర్‌ప్రైజెస్ మీదుగా సాగిన ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా వద్ద ముగిసింది. ఈ ర్యాలీలో పాఠశాల విద్యార్థులు, మహిళలు, ఉపాధ్యా యులు, ఫిజికల్ డైరెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్షరాస్యత అంటే కేవలం చదవడం, రాయడం నేర్చుకోవడం మాత్రమే కాదని, అది వ్యక్తి సాధికారతకు, కుటుంబ అభివృద్ధికి, సమాజ పురోగతికి పునాది అని అన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉల్లాస్ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులను విద్య వైపు ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. "అక్షరం ప్రతి ఒక్కరి హక్కు.. విద్య ప్రతి కుటుంబానికి బలం. నిరక్షరాస్యతను నిర్మూలించి, ప్రతి వ్యక్తిని అక్షరాస్యుడిగా తీర్చిదిద్దడం మనందరి సామాజిక బాధ్యత" అని పేర్కొన్నారు.

వయోజన విద్యా శాఖ ఉప సంచాలకులు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో అక్షరాస్యత ప్రాధాన్యతపై అవగాహన కల్పించడం, నిరక్షరాస్యులను విద్య వైపు ప్రోత్సహించడం, "ప్రతి ఒక్కరూ చదవాలి.. ప్రతి ఒక్కరూ ఎదగాలి" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం ర్యాలీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. చీxరా-ఖుూూూ కార్యక్రమంలో భాగంగా వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వివరించారు.

ప్రతి కుటుంబంలో విద్యకు ప్రాధాన్యత పెరగాలని, నిరక్షరాస్యత నిర్మూలనకు అధికారులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, జడ్పీసీఈవో వెంకటరెడ్డి, డీఈవో విజయకుమారి, డీఆర్డీవో నర్సింహులు, వయోజన విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ అక్షరాస్యులు కావాలి: కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** అక్షరాస్యత అంటే కేవలం చదవడం, రాయడం మాత్రమే కాదని, వ్యక్తి జీవితాన్ని మార్చే శక్తి అని జిల్లా కలెక్టర్ ప్రియాంక అన్నారు. అంతర్జాతీయ అక్షరా స్యత దినోత్సవం సందర్భంగా నారాయణ పేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన అక్షరాస్యత ర్యాలీని ఆమె ప్రారంభించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి సత్యనారాయణ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్య జ్ఞానం, ఆత్మవిశ్వాసం, స్వావలంబనను అందిస్తుందని తెలిపారు. జిల్లాలో అక్షరాస్యత శాతం 49.93 మాత్రమే ఉందని, పురుషుల అక్షరాస్యత 60.32 శాతం కాగా, మహిళల అక్షరాస్యత 39.72 శాతంగా ఉందని వివరించారు. మహిళల అక్షరాస్యతలో ఉన్న అంతరాన్ని తగ్గించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు.

మహిళా సంఘాలు, స్వయం సహాయక సంఘాల సహకారంతో మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అమలులో ఉన్న ఉల్లాస్ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులను గుర్తించి చదవడం, రాయడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలను అందిస్తున్నామని చెప్పారు. గుర్తించిన అభ్యాసకులను సెప్టెంబర్‌లో నిర్వహించనున్న ఎఫ్ఎల్ఎన్ఏటీ/ ఎన్ఐఓఎస్ పరీక్షలకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

జిల్లా అధికారులు, విద్యాశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, స్వయం సహాయక సంఘాలు, వాలంటీర్లు, ప్రజలు సమన్వయంతో పనిచేసి అక్షరాస్యత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలని, ప్రతి మహిళ అక్షరాస్యురాలు కావాలని, ప్రతి గ్రామం సంపూర్ణ అక్షరాస్యత వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. "చదువు ఉంటేనే అభివృద్ధి.. అక్షరాస్యత ఉంటేనే సాధికారత" అని అన్నారు.

జిల్లాను అక్షరాస్యతలో ముందంజలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో డీఈఓ గోవిందరాజు, డీఆర్డీవో వెంకట్రాములు, డీపీఆర్వో రషీద్, మున్సిపల్ కమిషనర్ శంకర్, ఎంఈఓ బాలాజీ, ఉల్లాస్ కోఆర్డినేటర్ రఘునాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కళాకారులు పాల్గొన్నారు.

## మందుబాబుల గుండెల్లో రైళ్లు!

- కొల్చారం రోడ్లపై డ్రంక్ అండ్ డ్రైవ్ మెరుపు తనిఖీలు
- ప్రమాదాల నివారణే లక్ష్యం.. ఎస్ఐ మహమ్మద్ మోహీనుద్దీన్ ఆధ్వర్యంలో ముమ్మర తనిఖీలు




**కొల్చారం, సెప్టెంబర్ 08 (జనంసాక్షి):** మద్యం మత్తులో వాహనాలు నడిపే వారిపై కొల్చారం పోలీసులు కొరడా ఝుళిపించారు. ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఎస్ఐ మహ మ్మద్ మోహీనుద్దీన్ ఆధ్వర్యంలో కొల్చారం రోడ్లపై మంగళవారం ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ప్రత్యేక వ్యూహంతో తనిఖీలు చేపట్టి మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించేలా చర్యలు చేపట్టారు.

**ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ...**

ఎస్ఐ మహమ్మద్ మోహీనుద్దీన్ స్వయంగా రోడ్డుపైకి వచ్చి వాహనాలను ఆపి బ్రీత్ అనలైజర్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

**నిర్లక్ష్యంతో కుటుంబాలకే కాదు.. ఇతరుల ప్రాణాలకూ ముప్పు**

ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడిపి తమ ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుకోవద్దని వాహనదారులకు సూచించారు. వాహనదారుల నిర్లక్ష్యం కారణంగా వారి కుటుంబ సభ్యులతో పాటు రోడ్డుపై ప్రయాణించే అమాయకుల ప్రాణాలకు సైతం ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. చట్టాన్ని అతిక్రమించే వారెవరైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే భారీ జరిమానాతో పాటు జైలు శిక్ష పడే అవకాశం ఉందని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు కొల్చారం పోలీసులు నిరంతరం చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు.